## విలేకరులు కావలెను

మనవార్త దినపత్రిక లో
పనిచేయుటకు విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల
వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను
Cell: 9247819181
8309605189



# మన వార్త

ప్రజాగళానికి అక్షర రూపం

MANA VAARTHA






Telangana | సంపుటి: 1, సంచిక: 230 | volume: 1, Issue: 230 | గురువారం 19 మార్చి 2026 పేజీలు : 8 వెల : 3.00


## రాజకీయాల్లో పదవీ విరమణ ఉండదు



**– రాజ్యసభ వీడ్కోలు సభలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు!**

**న్యూఢిల్లీ:** రాజకీయ ప్రస్థానంలో పదవీ విరమణ అనేది కేవలం ఒక సాంకేతిక ప్రక్రియ మాత్రమేనని, ప్రజా సేవలో ఎప్పుడూ విరామం ఉండదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. రాజ్యసభ సభ్యుల వీడ్కోలు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సభను వీడుతున్న వారు సమాజ శ్రేయస్సు కోసం తమ వంతు కృషిని నిరంతరం కొనసాగించాలని పిలుపునిచ్చారు. పార్లమెంటులో జరిగిన సుదీర్ఘ చర్చలు, విభిన్న అభిప్రాయాలు అన్నీ భారత ప్రజాస్వామ్య బలాన్ని చాటుతాయని ఆయన పేర్కొన్నారు. దేశాభివృద్ధిలో ప్రతి ఒక్క సభ్యుని అనుభవం ఎంతో విలువైనదని, ఆ అనుభవ పాఠాలు ఎన్నటికీ వృథా కావని మోదీ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన ఎంపీలు.. హెచ్‌డీ దేవెగౌడ, శరద్ పవార్, మల్లిఖార్జున ఖర్గే వంటి సీనియర్ నేతల నుండి ఎన్నో విషయాలు నేర్చుకోవాలని ప్రధాని సూచించారు. దశాబ్దాల కాలం పాటు పార్లమెంటరీ సేవలో గడిపిన వీరి జీవితాలు యువ నాయకులకు మార్గదర్శకాలని ఆయన కొనియాడారు. ఇదే క్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే తనదైన శైలిలో చమత్కరిస్తూ.. దేవెగౌడ గారితో తనకున్న 54 ఏళ్ల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. "ఆయన మమ్మల్ని ప్రేమించి, మోదీని పెళ్లి చేసుకున్నారు" అని ఖర్గే అనడంతో సభలో నవ్వులు పూశాయి. రాజకీయాల్లో ఉన్నవారు అలసిపోరని, దేశం కోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటారని ఖర్గే అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో 26 మంది ఏకగ్రీవంగా ఎన్నికవ్వగా, మిగిలిన స్థానాలకు పోలింగ్ ద్వారా అభ్యర్థులు విజయం సాధించారు.


## సీఎం పదవి ఆఫర్‌ను తిరస్కరించిన విజయ్



**– తమిళ రాజకీయాల్లో సంచలనం!**

**చెన్నై:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల వేళ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. టీవీకే అధినేత, ప్రముఖ నటుడు విజయ్‌కు ఒక జాతీయ పార్టీ ఏకంగా ముఖ్యమంత్రి పదవిని ఆఫర్ చేసిందనే వార్త ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ విషయాన్ని టీవీకే కీలక నేత అధవ్ అర్జున స్వయంగా వెల్లడించారు. సదరు జాతీయ పార్టీ తొలుత 50 సీట్లు ఇస్తామని ప్రతిపాదించి, ఆ తర్వాత ఆ సంఖ్యను 90కి, చివరికి సగం సీట్లకు పెంచుతూ విజయ్‌ను సీఎం అభ్యర్థిగా ప్రకటించేందుకు సిద్ధపడిందని ఆయన పేర్కొన్నారు. అయితే, పదవుల కోసం విజయ్ ఢిల్లీ ముందు తలవంచబోరని, ఆ ఆఫర్‌ను ఆయన సున్నితంగా తిరస్కరించారని అర్జున స్పష్టం చేశారు. ఆ జాతీయ పార్టీ పేరును ఆయన బహిరంగంగా వెల్లడించకపోయినప్పటికీ, అది బీజేపీయేనని రాజకీయ వర్గాల్లో బలంగా ప్రచారం జరుగుతోంది. వచ్చే నెలలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ ఒంటరిగానే బరిలోకి దిగుతుందని విజయ్ ఇప్పటికే స్పష్టం చేశారు. డీఎంకేను ఓడించడమే లక్ష్యంగా జాతీయ పార్టీలు విజయ్ మద్దతు కోసం ప్రయత్నిస్తున్నప్పటికీ, ఆయన మాత్రం ఎవరితోనూ పొత్తు పెట్టుకోకూడదని నిర్ణయించుకున్నారు. మరో ఒకటి రెండు రోజుల్లో టీవీకే అభ్యర్థుల జాబితా విడుదలయ్యే అవకాశం ఉంది. సమాచారం ప్రకారం.. విజయ్ పెరంబూర్ నియోజకవర్గం నుండి పోటీ చేయనుండగా, కీలక నేతలు ఎన్. ఆనంద్ టీ నగర్ నుండి, అధవ్ అర్జున విల్లివక్కం నుండి బరిలోకి దిగనున్నారు. ఏప్రిల్ 23న పోలింగ్ జరగనుండగా, మే 4న ఫలితాలు వెలువడనున్నాయి. సూపర్ స్టార్ విజయ్ రాజకీయ రంగప్రవేశం తమిళ ఓటర్లను ఏ మేరకు ప్రభావితం చేస్తుందోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## క్లస్టర్ బాంబులతో విరుచుకుపడ్డ ఇరాన్



**– సెంట్రల్ ఇజ్రాయెల్ టార్గెట్‌గా దాడి!**

**టెల్ అవివ్:** మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరోసారి తీవ్రరూపం దాల్చాయి. తమ అగ్ర కమాండర్ల మృతికి ప్రతీకారంగా ఇరాన్ మంగళవారం రాత్రి ఇజ్రాయెల్‌పై బాలిస్టిక్ క్షిపణులు మరియు నిషేధిత క్లస్టర్ బాంబులతో భీకర దాడికి తెగబడింది. సెంట్రల్ ఇజ్రాయెల్ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుని జరిగిన ఈ దాడిలో పలు చోట్ల క్లస్టర్ బాంబులు పేలినట్లు సమాచారం. ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజానీ, మరో కీలక కమాండర్ ఘోలమ్రెజా సోలేమాని సోమవారం రాత్రి ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో మరణించగా, దానికి కౌంటర్ గా ఇరాన్ ఈ చర్యకు పాల్పడింది. దాడికి సంబంధించిన ఓ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. క్లస్టర్ బాంబుల కారణంగా సెంట్రల్ ఇజ్రాయెల్‌లో ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. ఈ బాంబుల ద్వారా విడుదలైన ఒక సబ్ మ్యునిషన్ (చిన్న బాంబు) రోడ్డును పూర్తిగా ధ్వంసం చేసింది. దాడుల సమాచారం అందగానే ఇజ్రాయెల్ అధికారులు అప్రమత్తమై దేశవ్యాప్తంగా సైరన్లు మోగించారు, దీంతో ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లగలిగారు. దక్షిణ ఇజ్రాయెల్‌లో కూడా సైరన్లు వినిపించాయి. మెడికల్ బృందాలు మరియు రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలాలకు చేరుకుని క్లస్టర్ బాంబు బాధితులను ఆదుకుంటున్నారు. అయితే, ఈ దాడిలో ఇప్పటివరకు ఎటువంటి ప్రాణ నష్టం సంభవించలేదని, ఎవరికీ గాయాలు కాలేదని మెడిక్స్ ధృవీకరించారు. ఇరాన్ ప్రయోగించిన నిషేధిత ఆయుధాల కారణంగా అంతర్జాతీయ సమాజం ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తోంది.

## ఉగాది సందర్భంగా నేతలకు మట్టి పాత్రల అందజేసిన ఉప ముఖ్యమంత్రి



**– మట్టి పాత్రలు వాడాలని పిలుపు...**

**– కుల వృత్తులకు ప్రోత్సాహం అవసరం...**

**హైదరాబాద్:** శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా శాసనసభ ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కలకు ఉగాది మట్టి పాత్రలను అందజేశారు. సంప్రదాయ పద్ధతుల్లో పండుగను జరుపుకోవాలని సందేశం ఇచ్చే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. "మట్టి పాత్రలు వాడండి ఆరోగ్యాన్ని కాపాడుకోండి, కుల వృత్తులను ప్రోత్సహించండి" అనే నినాదంతో ఈ ఉగాది కిట్‌ను అందజేశారు. ఇందులో ఉగాది పండుగకు ఉపయోగపడే మట్టి కుండ, గ్లాసులు, జగ్, బౌల్‌తో పాటు షడ్రుచులకు అవసరమైన మామిడి కాయలు, వేప పువ్వు, బెల్లం, చింతపండు, కారం వంటి పదార్థాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు రాష్ట్ర ప్రజలకు శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రకృతిని కాపాడుకోవడానికి, పర్యావరణాన్ని రక్షించడానికి మట్టి పాత్రల వినియోగం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఆరోగ్య పరిరక్షణలో కూడా మట్టి పాత్రల వినియోగం మంచి ఫలితాలను ఇస్తుందని తెలిపారు. మన సంస్కృతి సంప్రదాయాల్లో మట్టి పాత్రలకు ప్రత్యేక స్థానం ఉందని నాయకులు పేర్కొన్నారు. మట్టి పాత్రల వినియోగాన్ని పెంచడం ద్వారా కుల వృత్తులను ప్రోత్సహించవచ్చని తెలిపారు. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఉగాది పండుగను మట్టి పాత్రలతో జరుపుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## రైతు మహోత్సవంలో
## రైతులందరూ ఉత్సాహంగా పాల్గొనాలి



**–నంగునూరులో నాలుగు రోజుల రైతు మహోత్సవం...**

**–వ్యవసాయ ఉత్పత్తులు, యంత్ర పరికరాల ప్రదర్శనలు...**

**–శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమాలు...**

**జనగామ:** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని నర్మెట్ట గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు మహోత్సవం 2026లో రైతులందరూ ఉత్సాహంగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ రైతులను కోరారు. రైతులకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలను ఏర్పాటు చేస్తోందని ఆయన తెలిపారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ వ్యవసాయ, ఉద్యానవన, ఆయిల్ ఫెడ్ మరియు అనుబంధ శాఖల అధికారులతో పాటు ఆర్టీసీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతు మహోత్సవం ఏర్పాట్లపై అధికారులు సమగ్రంగా పని చేయాలని ఆయన సూచించారు. రైతు మహోత్సవం కార్యక్రమానికి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు పెద్ద ఎత్తున పాల్గొనేలా రవాణా, సమాచారం మరియు ఇతర సౌకర్యాలను సమన్వయం చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. తెలంగాణలో అతిపెద్ద పామ్ ఆయిల్ కర్మాగారం ప్రారంభోత్సవం, రైతు భరోసా నిధుల విడుదల వంటి కార్యక్రమాలతో పాటు వ్యవసాయ ఉత్పత్తులు, యంత్ర పరికరాల ప్రదర్శనలు మరియు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. అలాగే శాస్త్రవేత్తలతో నేరుగా ముఖాముఖి కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలు రైతులకు ఎంతో ఉపయోగపడతాయని, రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోని, మార్కెటింగ్, ఉద్యానవన తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సంక్షోభంలో ఉన్న ఇరాన్‌కు భారత్ బాసట




**– తొలి విడత మానవతా సాయం అందజేత!**

**టెహ్రాన్:** అమెరికా–ఇజ్రాయెల్ దాడుల కారణంగా తీవ్ర ఇంధన, మానవతా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ఇరాన్‌కు భారత్ అండగా నిలిచింది. యుద్ధం కారణంగా మందుల కొరతతో అల్లాడుతున్న ఆ దేశానికి మానవతా దృక్పథంతో అత్యవసర వైద్య సామాగ్రితో కూడిన తొలి విడత సాయాన్ని భారత్ అందజేసింది. ఈ సహాయం ఇరాన్‌కు చేరినట్లు ఆ దేశ ప్రభుత్వం బుధవారం అధికారికంగా ధ్రువీకరించింది. కష్టకాలంలో తమను ఆదుకున్నందుకు భారత ప్రభుత్వానికి, ప్రజలకు ఇరాన్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది. ఫిబ్రవరి 28 నుండి కొనసాగుతున్న దాడుల వల్ల ఇరాన్‌లో వేలాది మంది పౌరులు గాయపడగా, అక్కడి ఆసుపత్రుల్లో అత్యవసర మందులకు తీవ్ర కొరత ఏర్పడిన నేపథ్యంలో భారత్ ఈ నిర్ణయం తీసుకుంది. భారత్ పంపిన ఈ వైద్య సామాగ్రిని 'ఇరానియన్ రెడ్ క్రెసెంట్ సొసైటీ' ప్రతినిధులు అందుకున్నారు. ఈ విషయాన్ని న్యూఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయం సోషల్ మీడియా వేదికగా వెల్లడిస్తూ, దయార్ద్ర హృదయంతో స్పందించిన భారత ప్రజలకు ధన్యవాదాలు తెలిపింది. ఇరాన్ పౌరులకు మానవతా సాయం అందించే విషయంపై భారత విదేశాంగ శాఖ కొద్దిరోజులుగా జరుపుతున్న చర్చలు ఫలించి, ఇప్పుడు ఈ సాయం క్షేత్రస్థాయికి చేరింది. భారత్‌తో పాటు చైనా, రష్యా, అజర్‌బైజాన్ వంటి దేశాలు కూడా ఇరాన్‌కు సహాయాన్ని అందిస్తున్నాయి. మరోవైపు, యుద్ధం కారణంగా అక్కడ చిక్కుకుపోయిన భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తరలించేందుకు కేంద్ర ప్రభుత్వం వేగంగా చర్యలు చేపడుతోంది.

## తండ్రి మరణం పుట్టెడు దు:ఖంలో,కన్నీటితో పది పరీక్ష రాసిన కొడుకు




**ఎల్లారెడ్డి పేట మార్చి 18 : (మన వార్తా ప్రతినిధి )**రాజన్న సిరిసిల్ల జిల్లా లో జరిగిన హృదయ విషాదకర సంఘటన ఇది ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి గుండెపోటుతో చికిత్స పొందుతూ బిజెపి నాయకులు సందుపట్ల రాజిరెడ్డి ( 44 ) మృతిచెందాడు. రాజిరెడ్డి కి బుధవారం మధ్యాహ్నం అంత్యక్రియలు జరగాల్సి ఉంది. అయితే ఈ దు:ఖాన్ని దిగమింగుకొని ఆయన కొడుకు అక్షిత్ రెడ్డి పదోతరగతి పరీక్షకు హాజరయ్యాడు. ఈ విషాదకర సంఘటన ప్రతి ఒక్కరినీ కలిచివేస్తోంది. తండ్రి మరణించిన పుట్టెడు దు:ఖంలో కూడా, తన భవిష్యత్తు కోసం కన్నీళ్లతో పరీక్షా కేంద్రానికి వచ్చిన ఆ విద్యార్థి.. తన సహచర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారని స్థానికులు అంటున్నారు .



## ఇద్ కా తోఫా పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న

**వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ సబేర బేగం గౌస్**

**ఎల్లారెడ్డిపేట మార్చి18: (మన వార్తా ప్రతినిధి)**ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామంలో రంజాన్ కానుకగా ముస్లిం పేద మహిళలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వారి సాంప్రదాయాలకు అనుగుణంగా ఈద్ ముబారక్ ఈద్ కా తోఫా లో భాగంగా చీరలను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మస్జిద్ కమిటీ చైర్మన్ షేక్ గౌస్ , నారాయణపూర్ ఉప సర్పంచ్ మధు సుధన్ , నారాయణపూర్ వార్డు మెంబర్ షేక్ సమద్ ,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు దొమ్మటి రాజు, తదితరులు పాల్గొన్నారు.



## నీటి పొదుపే రేపటి తరానికి జీవనదారం...

**-గుగ్గిళ్ళలో బాలవికాస ఆధ్వర్యంలో ప్రపంచనీటి దినోత్సవ అవగాహన సదస్సు...**

**బెజ్జంకి,మార్చి 18(మన వార్త ప్రతినిధి)**సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని గుగ్గిళ్ళ గ్రామంలో బాల వికాస స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవం పురస్కరించుకొని ముందస్తుగా గుగ్గిళ్ళ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,ప్రాథమిక పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు నీటి ప్రాముఖ్యతపై నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ చేపట్టారు. యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుగ్గిళ్ల గ్రామ సర్పంచ్ గుగ్గిళ్ల మల్లయ్య, ఉపసర్పంచ్ దుగ్యానీ లావణ్య, వార్డు సభ్యులు హాజరై ప్రపంచ నీటి దినోత్సవం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నేడు మనం పొదుపు చేసే ప్రతి నీటి చుక్క రేపటి తరానికి జీవనాధారమని,జలాన్ని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలకు కన్నీరే మిగులుతుందని స్పష్టం చేశారు.అనంతరం గ్రామ కూడలిలో మానవహారంగా ఏర్పడి నీటి సంరక్షణ పై ప్రజలకు అవగాహన కల్పించారు.బాలవికాస సంస్థ ప్రతినిధులు సుజాత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని, జలమే మూలమని బాలవికాస సంస్థ కోఆర్డినేటర్లు సుజాత వివరిస్తూ జలం లేనిదే,జీవనం లేదని,ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ,పొలాల్లో పాము పాండు ఏర్పాటు చేసుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర జల సంక్షోభం ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షపు నీటిని పొడిసి పట్టుకోవడం ద్వారానే భూగర్భ జలాలను కాపాడుకోగలుగుతామని తెలిపారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ యొక్క వ్యాసరచన పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో జెడ్పిహెచ్ఎస్ పాఠశాల హెడ్మాస్టర్ మమతా గౌతమి, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం శ్రీనివాస్,ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## తోర్ల పాడు లో ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా

**-తోర్లపాడు గ్రామ షేక్ కన్నో సాహెబ్ మధిర మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్ ల ఆధ్వర్యంలో పంపిణీ...**



**మధిర మార్చి18( మన వార్త )**ముస్లిం సోదర-సోదరీమణులకు రంజాన్ పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి మరియు ఆర్థిక,విద్యుత్ శాఖ మంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా (రంజాన్ కానుక ) అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు నరెడ్ల వెంకటరెడ్డి చేబ్రోలు కృష్ణ వాసిరెడ్డి రవికుమార్ వాసిరెడ్డి వెంకటరావు నల్లమల బాబురావు సూర్యదేవర వెంకటేశ్వరరావు గ్రామ ముస్లిం సోదరులు,మహిళలు, ఉపసర్పంచ్ సుంకర రామారావు వార్డు మెంబర్లు కాశి బోయిన అరుణా శేషు, బొబ్బిల్ల వీర వెంకయ్య షేక్ బికార్ సాహెబ్ వేల్పుల సత్యనారాయణ వేల్పుల సాంబయ్య కాశీపోయిన నరసింహారావు గ్రామ యువజన కాంగ్రెస్ నాయకులు వేల్పుల ప్రవీణ్ సీతయ్య బాబు నరేష్ ఐలపోగు కాటయ్య కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నవోదయలో చోటు దక్కించుకున్న సత్యశోధక్ విద్యార్థిని హారిణి కృషి, పట్టుదలకు ప్రతిఫలం



**నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం(మన వార్త) మార్చ్ 18** నిజామాబాద్ జిల్లాలోని జవహార్ నవోదయ విద్యాలయంలో 2026–27 విద్యాసంవత్సరానికి ఆరవ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షలో సత్యశోధక్ పాఠశాల విద్యార్థిని ఎం. హారిణి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఎంపిక కావడం విశేషం. గత సంవత్సరం డిసెంబర్‌లో జరిగిన ఈ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదల కాగా, హారిణి ఎంపిక జాబితాలో స్థానం సంపాదించింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య హారిణిని అభినందిస్తూ, ఆమె కృషి, పట్టుదల వల్లే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. అనంతరం ఆమెను ప్రత్యేకంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.విద్యార్థులు చిన్నప్పటి నుంచే క్రమశిక్షణతో చదువుతూ తమ లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలని ప్రిన్సిపాల్ సూచించారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడమే కాకుండా సమాజ అభివృద్ధికి కూడా తమ వంతు బాధ్యతగా ముందుకు రావాలని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు

## వాణినికేతన్ లో ముందస్తు ఉగాది వేడుకలు...

**ఇల్లంతకుంట,మార్చి 18 (మన వార్త ప్రతినిధి);**ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వాణినికేతన్ హై స్కూల్ లో ముందస్తు ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి.పాఠశాల ఆవరణలో బుధవారం ఉగాది పచ్చడిని తయారుచేసి విద్యార్థులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ తూముకుంట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉగ అంటే నక్షత్ర గమనం,ఆది అంటే మొదలు అన్నారు.వసంత రుతువు ఆరంభం అవుతుండడంతో చెట్లు చిగురిస్తాయని పేర్కొన్నారు.షడ్రుచుల సమ్మిళితమైన ఉగాది పచ్చడి లాగా ప్రతి ఒక్కరి జీవితాలలో కష్టసుఖాలు ఉంటాయని వాటిని సమానంగా స్వీకరించాలన్నారు.గత సంవత్సరపు చేదు జ్ఞాపకాలను మర్చిపోయి కొత్త సంవత్సరంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు శ్రీ పరాభవనామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ తూముకుంట శ్రీనిధి, ఉపాధ్యాయులు సుమంగళి, శోభ, రేఖ, మహాలక్ష్మి, లావణ్య, సునంద, మౌనిక, కళ్యాణి, రేణుక, జలజ, శాంత, పద్మ, రేణుక, సునీత, స్వాతి, శ్రీనివాస్, రాజు, సంతోష్, తిరుపతి, రాజు,రమేష్ లతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## సెలెస్టియల్ హై స్కూల్లో ఘనంగా ముందస్తు ఉగాది సంబరాలు...

**రాజన్న సిరిసిల్ల మార్చి 18 (మన వార్త )**రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌లో ఉన్న సెలెస్టియల్ హై స్కూల్లో కరస్పాండెంట్ బుర్ర రాధాకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో పరాభవ నామ సంవత్సరంను పురస్కరించుకుని ముందస్తు ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, సమిష్టిగా బ్రహ్మదేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీపి, కారం, చేదు, ఉప్పు, వగరు, పులుపు అనే షడ్రుచుల సమ్మేళనంతో తయారు చేసిన ఉగాది పచ్చడి, భక్షాలు, పులిహోరలను నైవేద్యంగా సమర్పించారు. అలాగే పంచాంగ శ్రవణం కార్యక్రమం కూడా నిర్వహించబడింది.తరువాత ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉగాది పచ్చడి సేవించి, భక్షాలు, పులిహోరను ఆనందంగా ఆస్వాదించారు.ఈ సందర్భంగా కరస్పాండెంట్ బుర్ర రాధాకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, “యుగాది అంటే యుగానికి ఆది, అంటే ఒక కొత్త యుగం ప్రారంభమని అర్థంఅని అన్నారు.ఇది నూతన తెలుగు సంవత్సర ఆరంభాన్ని సూచించే పర్వదినం” అని తెలిపారు. ఉగాది పచ్చడిలోని ఆరు రుచులు–తీపి (చెరకు), కారం (మిరియాలు), చేదు (వేపపువ్వు), ఉప్పు (ఉప్పు), వగరు (మామిడికాయ), పులుపు (చింతపండు)–మన జీవితంలోని ఆనందం, బాధ, కోపం, భయం, ఆశ్చర్యం, విచారం వంటి భావోద్వేగాలను సూచిస్తాయని పేర్కొన్నారు. జీవితం లో సుఖదుఃఖాలను సమానంగా స్వీకరించాల్సిన అవసరాన్ని ఈ పండుగ తెలియజేస్తుందని అన్నారు.అలాగే ఉగాది సందర్భంగా ఇళ్లను శుభ్రపరచి, ముగ్గులతో అలంకరించి, కుటుంబ సభ్యులతో కలిసి ఉగాది పచ్చడి సేవిస్తూ ఆనందంగా పండుగను జరుపుకోవడం తెలుగువారి సంప్రదాయం అని పేర్కొన్నారు. ఈ పండుగ తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ బుర్ర రాధాకృష్ణ ప్రసాద్, ప్రిన్సిపాల్ మచ్చ ఇందిర, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పట్టణ ప్రముఖులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాద బాధిత యువకుడికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సాయం

**-ప్రమాదంతో పోరాడుతున్న అరుణ్‌కు ప్రభుత్వం అండ వెంటనే రే.5 లక్షల మంజూరు...**

**ఎల్కతుర్తి మార్చి 18 మనవార్త ప్రతినిధి** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన యువకుడు బొంకూరి అరుణ్ (జోజి) ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన నిమ్స్ ఆసుపత్రి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు.బాధితుడి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.3,50,000 ఆర్థిక సాయం మంజూరైంది. ఈ సాయాన్ని పొన్నం ప్రభాకర్ గౌడ్ హుస్నాబాద్ శాసనసభ్యులు మరియు రాష్ట్ర బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రివర్యులు తక్షణ సహాయంగా అందించారు.ఈ ఆర్థిక సాయం మంజూరులో ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుకినే సంతాజీ కీలక పాత్ర పోషించారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి పత్రాన్ని యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు హింగే శ్రీకాంత్ బాధితుడి కుటుంబ సభ్యులకు నిమ్స్ ఆసుపత్రిలో అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షులు బొంకూరి క్రాంతికుమార్ (కంటెస్టెడ్ సర్పంచ్) బొంకూరి కరుణాకర్ మైస శ్రీకాంత్ జర్నలిస్ట్ బొంకూరి వంశీ తదితరులు పాల్గొన్నారు



## ప్రాణాలు పోయిన పట్టించుకోరా మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

**-పులి సంచారంతో భయం గుప్పిట్లో ప్రజలు, రైతులు...**

**కొడిమ్యాల: మార్చి 18 మన వార్త ప్రతినిధి** పులిని బంధించి సురక్షితమైన ప్రాంతానికి తరలించాలని అడిషనల్ కలెక్టర్ గారికి వినతి పత్రం అందజేసిన చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ జగిత్యాల జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ దావ వసంత జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం గంగారాం తండాలో పులి భయం ఉధృతమవుతుండగా, అటవీ అధికారుల నిర్లక్ష్యంపై చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆగ్రహం వ్యక్తం చేసారు. పులిని అటవీశాఖ అధికారులు వెంటనే బంధించి సురక్షితమైన ప్రాంతం తరలించాలని,బుధవారం జగిత్యాల జిల్లా మాజీ జెడ్పి చైర్మన్ దావ వసంత, టిఆర్ఎస్ నాయకులతో కలిసి జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్ గారికి వినతి పత్రం ఇచ్చారు.గత ఏడాది కాలంగా కొడిమ్యాల మండలం,సిరిసిల్ల సిద్దిపేట భువనగిరి ప్రాంతాలలో, సంచరిస్తూ, సుమారు 20 దాకా పశువులను చంపి తిని, గత నాలుగు రోజులుగా కొడిమ్యాల ప్రాంతంలో తిరుగుతూ పశువులపై దాడులు చేస్తున్న పులి, మృతి చెందిన ఆవును తినడానికి వరుసగా రెండు రోజులుగా వస్తున్నప్పటికీ అధికారులు కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని రవిశంకర్ తీవ్రంగా మండిపడ్డారు.సీసీ కెమెరాల్లో పులి కదలికలు స్పష్టంగా రికార్డు అయినా, పులి సంచారం నిర్ధారణ అయినా కూడా అధికారులు కేవలం నామమాత్రపు హాజరు చూపుతూ వెళ్లిపోతున్నారని, “అటు వెళ్లకండి” అంటూ హెచ్చరించడం తప్ప భద్రతా చర్యలు ఏవీ కనిపించడం లేదని, విమర్శించారు.



## అనంతారం గ్రామంలో యువ మండల్ వికాస్ అభియాన్ ఘన విజయం..

**-5 రోజుల్లో 50 గ్రామాల్లో కార్యక్రమాలు యువజన సంఘాల బలోపేతానికి చర్యలు...**

**ఇల్లంతకుంట,మార్చి 18 (మన వార్త ప్రతినిధి);**గ్రామీణ యువతను ఏకం చేసి అభివృద్ధి దిశగా నడిపించడమే లక్ష్యంగా ‘మై భారత్ రాజన్న సిరిసిల్ల,శ్రీకృష్ణ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామంలో “యువ మండల్ వికాస్ అభియాన్”కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఐదు రోజుల వ్యవధిలో 50 గ్రామాల్లో ఈ కార్యక్రమాలను చేపట్టి యువతలో చైతన్యం,అవగాహన కల్పించారు.గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో యువజన నాయకులకు ప్రత్యేక అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు.ఉమ్మడి జిల్లా డివైఓ వెంకట రాంబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువజన సంఘాలను బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు.యువజన సంఘాలు లేని గ్రామాల్లో కొత్త సంఘాలను ఏర్పాటు చేసి,వాటిని మై భారత్ కరీంనగర్ ఉమ్మడి జిల్లా విభాగాలతో అనుసంధానం చేయనున్నట్లు పేర్కొన్నారు.దీని ద్వారా మై భారత్ నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో గ్రామీణ యువత చురుకుగా పాల్గొనే అవకాశాలు పెరుగుతాయని చెప్పారు.కార్యక్రమంలో ఆర్గనైజర్ అక్కెం నాగరాజు,సర్పంచ్ వొల్లల రజిత వెంకటేష్,ఉపసర్పంచ్ కదం జయంత్,వార్డు సభ్యులు అక్కెం ఉపేందర్,మల్యాల రాజశేఖర్,బట్టి క్రాంతి,శిలాపురం రమేష్ తదితరులతో పాటు యువజన సంఘ సభ్యులు బొల్లం శ్రీకాంత్,బండారి వెంకటేష్,గోనెపెల్లి వెంకటేష్,ఒల్లల కృష్ణకుమార్,కదం రాజు,ధరవేణి నాగరాజు,ఒల్లల మధు,చల్ల అంజి,అక్కెం హరికృష్ణ,చొప్పరి అభిరామ్,ఒల్లల శ్రీనివాస్,మల్యాల పర్శరాములు,అరవింద్,వినయ్,స్వామి కిరణ్,అభిషేక్, సురేష్ రాజు,సమీర్,రమేష్,వంశీ తదితరులు పాల్గొన్నారు.




## రిజిస్ట్రేషన్ సెక్షన్ 22(ఏ) వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు...



**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 18**రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22(ఏ) వల్ల సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య 8వ అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావించారు.బిఆర్ఎస్ బీజేపీ పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని , బాధిత కుటుంబాలను భయాందోళనకు గురి చేస్తున్నారాని , ప్రతిపక్షాలు రాజకీయ లబ్ధికోసం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ భూములను ఇళ్ల స్థలాలుగా కేటాయించి ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. దానితో పాటు ఇప్పుడు ఇందిరమ్మ ఇల్లు కూడా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇస్తుందని గుర్తు చేశారు. ఈ ప్రజా పాలన ప్రభుత్వంలో ఎట్టి పరిస్థితుల్లోనూ పేదలకు అన్యాయం జరగనీయబో మని వారి ఇళ్ల , స్థలాల హక్కులు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసు కుంటుందని.ముఖ్యంగా ఆలేరు నియోజకవర్గంతో పాటు యాదాద్రి భువనగిరి జిల్లా , రాష్ట్ర వ్యాప్తంగా అనేక గ్రామాల్లో దశాబ్దాల కాలంగా నివసిస్తున్న ఇండ్ల స్థలాలు కూడా ఈ జాబితాలో ఉండటం పై బాధితులు ఆవేదనతో ఉన్నారని..కావున క్షేత్రస్థాయిలో విచారణ జరిపి , అర్హులైన పేదలకు చెందిన ఇండ్లను , ప్లాట్లను వెంటనే ఈ నిషేధిత జాబితా నుండి తొలగించాలని ఆయన కోరారు.

# సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్



**జహీరాబాద్, మార్చి 18 (మన వార్త):** జహీరాబాద్ మండలం హుగ్గెల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులను ఆ గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ విమలా శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ 10 లక్షల రూపాయల నిధులతో రోడ్డు పనులను చేపట్టినట్లు తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని అన్నారు. గ్రామ ప్రజలకు మెరుగైన రాకపోకలు కల్పించేందుకు సీసీ రోడ్డు నిర్మాణం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# 10 పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్...

**-జిల్లాలో 10వ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి...**

**-అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 18** జిల్లాలో పదవతరగతి వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. బుధ వారం రోజు తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో 10వ తరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు , గైర్హాజరు వివరాలను సంబంధిత పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ లను అడిగి తెలుసుకున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద త్రాగునీరు ఏర్పాటు చేయాలన్నారు.విద్యార్థులను ప్రధాన గేట్ వద్ద పూర్తి స్థాయిలో తనిఖీ చేసిన తర్వాత పరీక్ష కేంద్రంలోకి పంపించాలని చెప్పారు. ప్రశ్న పత్రాలు , జవాబు పత్రాల డిపాజిట్ ను పోలీస్ భద్రతతో డిపాజిట్ చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాలవద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని , పరీక్ష కేంద్రంలోకి ఇతర వ్యక్తులను వెళ్లకుండా చూడాలని అన్నారు. పరీక్ష కేంద్రాల చుట్టు పక్కల జీరాక్స్ కేంద్రాలు మూసివేసేలా చూసుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడ మాల్ ప్రాక్టీస్ జరగ రాదని , పరీక్షల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించ వద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# స్కూటీ డిక్కీ నుండి 8 లక్షలు చోరి



**జహీరాబాద్, మార్చి 17 (మన వార్త):** స్కూటర్ డిక్కీ నుండి 8 లక్షల రూపాయలు దొంగతనం అయిన సంఘటన పై పిర్యాదు వచ్చినట్లు జహీరాబాద్ పట్టణ ఎస్ఐ కె వినయ్ కుమార్ పత్రిక ప్రకటనలో తెలిపారు. తుంకుంట గ్రామస్థుడైన పిర్యాదుదారు మెటల్ కుంట నర్సింహారెడ్డి తండ్రి తుక్కారెడ్డి పిర్యాదులో తెలిపిన వివరాల ప్రకారం, పిర్యాదుదారుడు తన భూమి రిజిస్ట్రేషన్ కొరకు జహీరాబాద్ ఎస్బిఐ మెన్ బ్రాంచ్ లో ఉన్న తన ఖాతా నుండి 7 లక్షల రూపాయలు తీసుకున్నాడు. తన దగ్గర ఉన్న 1 లక్ష తో పాటు, బ్యాంకులో తీసుకున్న 7 లక్షలు ద్విచక్ర వాహనంలో పెట్టుకుని దగ్గరలో ఉన్న మీ సేవ కు వెళ్ళి, అక్కడ ఉన్న తన ఊరి వ్యక్తి అయిన మేథరి బుచ్చయ్య తండ్రి పాపయ్య స్కూటీలో 8 లక్షల రూపాయలు పెట్టి, తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. స్కూటీని అక్కడే ఆపి కార్యాలయం లోపలికి వెళ్లి, అరగంటలో తిరిగి వచ్చి చూస్తే స్కూటీ డిక్కీలో కనపడలేదు. ఇట్టి విషయమై జహీరాబాద్ పోలీస్ స్టేషన్ లో బాధితుడు పిర్యాదు చేయగా ఎస్ఐ వినయ్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ సర్కార్ పెద్దపీట



**గజ్వేల్ మార్చ్ 18 మన వార్త ప్రతినిధి** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూశీకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. బుధవారం గిర్మాపూర్ లో స్థానిక సర్పంచ్ చిట్కుల విజయలక్ష్మితో కలిసి మురికి కాల్వల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలకు సిసి రోడ్లు, మురికి కాల్వల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి విడతలో రూ 5 కోట్ల 41 లక్షలు మంజూరీ చేసిందని స్పష్టం చేశారు. పార్టీలకు అతీతంగా నిధులు, ప్రభుత్వ పథకాలను వర్తింపజేస్తుండగా, సర్పంచులు త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ సీఎం రేవంత్ రెడ్డి చర్యలు తీసుకుంటుండగా, అర్హులైన ప్రతి పేదకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ తదితర కేటాయిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా రూ 2 లక్షల వరకు పంట రుణమాఫీ, సన్నధాన్యానికి రూ 500 బోనస్ చెల్లిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకోగా, మరో నాలుగు రోజుల్లో రైతు భరోసా నిధులు అన్నదాతల ఖాతాలలో జమ చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ప్రతి ఇంటికి ప్రజా సంక్షేమ పథకాలు వర్తింపజేస్తుశీడగా, జీర్ణించుకోలేని ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్ లక్ష్యంగా విమర్శలు చేస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే గజ్వేల్ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి అడిగినన్ని నిధులు ఇస్తుండగా, విద్య, వైద్యం, రవాణా, పారిశ్రామిక రంగాలకు పెద్దపీట వేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్, కాంగ్రెస్ సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కీసరి వెంకటేష్, సర్పంచులు చిట్కుల విజయలక్ష్మి, కుమార్ యాదవ్, చెన్నయ్య, యాదగిరి, మాజీ సర్పంచ్లు విష్ణువర్ధన్ రెడ్డి, చిట్కుల భూశీరెడ్డి, గోపాల్ రెడ్డి, నేతలు చిట్కుల గోవర్ధన్ రెడ్డి, గంగుమల్ల కొండల్ రెడ్డి, జయరాశీలు గౌడ్, నర్సాగౌడ్ పాల్గొన్నారు.

# కలెక్టరేట్ లో ప్రపంచ వినియోగదారుల దినోత్సవం...




**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 18** నాణ్యమైన వస్తువులు , పరిమాణం , వస్తువుల ధర గురించి తెలుసుకునే హక్కు ప్రతి వినియోగదారుడుకి ఉంటుందని జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి అన్నారు. బుధవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో "సురక్షిత మైన ఉత్పత్తులు , నమ్మక మైన వినియోగదారులు" అనే అంశం పై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారుల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు. కల్తీ వస్తువులను అధిగమించడానికి చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. విద్యావంతులకే కాక సామాన్యులకు కూడా సరైన న్యాయం జరిగినప్పుడే ప్రపంచం వినియోగదారుల దినోత్సవానికి సార్ధకత అని తెలిపారు. నాణ్యమైన వస్తువు సేవలను పొందడం ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు అని అన్నారు. ప్రతి శాఖ యొక్క సమాచారం తెలుసు కున్నప్పుడు అ శాఖ పై అవగాహన ఉంటుందని అన్నారు. సురక్షితమైన ఉత్పత్తులు మాత్రమే అందు బాటులో ఉండేలా కృషి చేయాలని తెలిపారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి మాట్లాడుతూ అత్యధిక ప్రజలకు చెరువులో ఉండే శాఖ తమదే అని , గ్రామీణ అర్బన్ ప్రాంతాల్లో మహిళా సంఘాల సభ్యులకు , సంఘ బంధం సభ్యులకు వినియోగదారుల హక్కుల గురించి చెప్పడం జరిగింది. ఫింఛన్లు , ఉపాధి హామీ పథకం క్రింద అర్హులకు వేతనాలు కూడా ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఉచిత న్యాయ సేవలు కోసం టోల్ ఫ్రీ నెంబర్ 15100 సంప్రదించ వచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రోజా రాణి , జిల్లా మేనేజర్ సివిల్ సప్లై కార్పొరేషన్ అధికారి హరికృష్ణ , జిల్లా డ్రగ్స్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ , జిల్లా మెట్రాలజీ అధికారి వెంకటేశ్వర్లు , వినియోగ దారుల ఫోరం సభ్యులు , స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఎన్ఆర్ఐ సైదులు భౌతికయానికి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు



**మధిర మార్చి18( మన వార్త)**మధిర మండలం ఇల్లూరు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ సైదులు అనారోగ్యంతో మరణించగా వారి భౌతిక ఖాయానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన మధిర మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సూరం శెట్టి కిషోర్ ఈ సందర్భంగా సూరంశెట్టి కిషోర్ మాట్లాడుతూ పుట్టిన ఊరు కోసం తన వంతు సాయం చేయాలని గ్రామంలో సొంత ఖర్చులతో పలు అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలందరి హృదయంలో చిరస్మరణీయంగా నిలిచిపోయారని ,అటువంటి సైదులు తక్కువ వయసులో మరణించడం కాంగ్రెస్ పార్టీకి ఇల్లూరు గ్రామానికి తీరని లోటని వారి ఆత్మకు శాంతి కలగాలని వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ కర్నాటి రామారావు, మధిరమార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్, ఇల్లూరు గ్రామ శాఖ అధ్యక్షులు ఫతేపురం సంగయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మార్తా ఈశ్వరరావు,పట్టణ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కోటా డేవిడ్, కోట రాకేష్, కోట ఏసు, తదితరులు పాల్గొని వాళ్ళు అర్పించారు

# మసీదు వంటశాల కోసం అవసరమైన ప్రధాన సామాగ్రి అందజేసిన మాజీ సర్పంచ్




**శంకరపట్నం:మార్చి18(మనవార్త ప్రతినిధి)**శంకరపట్నం మండలం కరీంపేట గ్రామంలో మాజీ సర్పంచ్ వనపర్తి మల్లయ్య వారి తల్లిదండ్రులు వనపర్తి మల్లమ్మ-రాజయ్య జ్ఞాపకార్ధంగా కరీంపేట్ లోని మసీద్ కు మసీదులలో ఇఫ్తార్ విందులు,సామూహిక వంటల కోసం అవసరమైన వంట సామాగ్రి,పాత్రలను (పెద్దపాత్రలు,గరిటెలు) మాజీ సర్పంచ్ వనపర్తి మల్లయ్య బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వనపర్తి మల్లయ్య రంజాన్,ఇతర పండుగల సందర్భంగా మసీదుల వద్ద వంట ఏర్పాట్లు ముస్లిం సోదరుల ఐక్యతకు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎగ్గని శ్రీలత-రమేష్,మాజీ జెడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బన్నయ్య గౌడ్,మాజీ ఉపసర్పంచ్ చింతం కుమారస్వామి,ప్రజా ప్రతినిధులు అశోక్,అనిల్,హరీశ్,ప్రసాద్,దామోదర్,దాశి,రాజయ్య,మల్లేశం తిరుపతి,భూమయ్య,స్వామి శంకరయ్య,భిక్షపతి,గ్రామ ముస్లిం సోదర,సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు.

# అధిక దిగుబడి వచ్చే పంటలు పండించాలి...



**-రైతులకు సూచించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 18** రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ కాలం అధిక దిగుబడి ఇచ్చే పంటలను వేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధ వారం రోజు తుర్కపల్లి మండలం దత్తాయిపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ , వ్యవసాయ శాఖ అధికారి రమణా రెడ్డి లతో కలసి క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రాప్ బుకింగ్ (పంట నమోదు), డిజిటల్ క్రాప్ బుకింగ్ , ఫార్మర్ రిజిస్ట్రీ , పథకాలను , కార్యక్రమాల , నమోదు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు.తదుపరి జిల్లా కలెక్టర్ జిల్లా ఉద్యాన శాఖ అధికారి మాధవి తో కలిసి ఆయిల్ పామ్ నర్సరీ , ఆయిల్ పామ్ క్షేత్రాలను పరిశీలించారు. రైతులు , నేషనల్ మిషన్ ఆన్ ఆయిల్ పామ్ (ఎన్ఎంఓపి) పథకం సద్వినియోగం చేసుకొని ఆయిల్ పామ్ సాగు చేసి తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందాలని సూచించారు. అనంతరం భువనగిరి మున్సిపాలిటీ హుస్సేనాబాద్ పరిధిలో డ్రిప్ ఇరిగేషన్ సిస్టం ద్వారా సాగు చేస్తున్న మామిడి తోటను జిల్లా కలెక్టర్ హార్టికల్చర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తోటలో అమలు చేస్తున్న డ్రిప్ ఇరిగేషన్ విధానం , నీటి వినియోగం మొక్కల పెరుగుదల తదితర అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి అధిక లాభాలు పొందేలా చూడాలన్నారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో జిల్లా వ్యవసాయ అధికారి పీ.వీ.రమణ రెడ్డి , జిల్లా ఉద్యాన అధికారి మాధవి , సహాయ వ్యవసాయ సంచాలకులు యాదగిరిగుట్ట శాంతి నిర్మల , తుర్కపల్లి మండల వ్యవసాయ అధికారి ఉమా , వ్యవసాయ అధికారి (సాంకేతిక విభాగం) రాజేష్ , చైతన్య , ఏఈవో లు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వాగ్దేవిలో ముందస్తు పరాభవ నామ సంవత్సర ఉగాది సంబరాలు




**చందుర్తి,మార్చ్ 18, మన వార్త.**చందుర్తి మండలం జోగాపూర్ గ్రామం వాగ్దేవి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ముందస్తు పరాభవ నామ సంవత్సర ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు.విద్యార్థిని విద్యార్థులు సాంప్రదాయ దుస్తువులను ధరించి పాఠశాలకు వచ్చారు. పాఠశాలలో పిల్లల సంతోషంతో పండగ వాతావరణం నెలకొన్నది. ఉపాధ్యాయ బృందం పిల్లలకు ఉగాది రోజున ప్రత్యేకంగా తయారు చేసుకొనే ఆరు రుచుల పచ్చడి గురించి వివరిస్తూ, తయారు చేశారు. వేప పువ్వు బాధ కష్టం, బెల్లం ఆనందం సంతోషం, చింతపండు ఆశ్చర్యం ఆసక్తి, మామిడి కోపం ఉత్సాహం, కారం సవాళ్లు, ఉప్పు జీవితంలో సమతుల్యత అని, ఉగాది పచ్చడి మన జీవితంలో సుఖం, దుఃఖం, కోపం, ఆనందం, ఆశ్చర్యం, సవాళ్లు అన్ని కలగలిపి ఉంటాయని తెలియజేస్తుంది అని పిల్లలకు వివరించారు. ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులకు పరాభవ నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కరస్పాండెంట్ సద్గుణ చారి మాట్లాడుతూ... ఉగాది అంటే తెలుగువారి కొత్త సంవత్సర ప్రారంభం. ఇది చైత్రమాసం మొదటిరోజు జరుపుకుంటారు. ఉగాది అనే పదం యుగాది నుండి వచ్చింది. యుగం అంటే కాలం, ఆది అంటే ప్రారంభం, అంటే ఇది కొత్త ప్రారంభానికి సూచిక అని పిల్లలకి వివరించారు... పరాభవ నామ సంవత్సరంలో పిల్లలందరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని, మంచిగా విద్యను అభ్యసించాలని మనస్ఫూర్తిగా భగవంతుణ్ణి కోరుకుంటూ విద్యార్థిని విద్యార్థులందరికి తెలుగు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఉగాది రోజు చేసుకునే ప్రత్యేకమైన పచ్చడిని తయారుచేసి విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయ బృందం సంతోషంగా సేవించారు. విద్యార్థులు ఉగాది ఎందుకు జరుపుకుంటారు అనే విషయాన్ని ఆంగ్లంలో ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# యధావిధిగా జాతీయ ఉపాధి హామీ చట్టం పథకాన్ని కొనసాగించాలి

**-విబిజి రాంజీ పథకాన్ని రద్దు చేయాలి....**

**-5 వారాల బకాయి వేతనాలు విడుదల చేయాలి...**

**-సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య...**

**రాయపోల్ మార్చి 18 మన వార్త:**ఉపాధి హామీ చట్టాన్ని గతంలో విధంగా కొనసాగించాలని విబిజి రాంజీ పథకాన్ని రద్దు చేయాలని పని ప్రదేశాల్లో కూలీలకు ఫోటో క్యాప్చర్ విధానం రద్దు చేయాలని, బకాయి పడిన 5 ఐదు వారాల వేతనాలు వెంటనే ఇవ్వాలని సిపిఎం పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రాయపోల్ ఎంపీడీవో కార్యాలయంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి పనులు కుదించే విధంగా బడ్జెట్లో నిధులను తగ్గించడం జరిగిందని విమర్శించారు. విబిజి రాంజీ పథకం ద్వారా ఉపాధి హామీ పథకం పేదలకు దూరమవుతుందన్నారు. పని ప్రదేశాల్లో ఫోటో రావడంలేదని, గ్రామాల్లోనే సిగ్నల్ లేకుండా ఫోన్లు సరిగా వినబడడం లేదని,ఆన్లైన్ ఫోటో ఎలా వస్తుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గతంలో విధంగా ఉపాధి పనులు కొనసాగించాలని డిమాండ్ చేశారు. చట్టంలో ఉపాధి కార్మికులకు భద్రతా ఉందని, కేంద్ర ప్రభుత్వం జిఎస్టి రూపంలో పనులు మొత్తం సేకరిస్తూ ఉపాధి హామీలో 40 శాతం రాష్ట్ర ప్రభుత్వ భరించాలని చేర్చడం ఉపాధి హామీ నిర్వీర్యం చేయడమేనని అన్నారు. బిజెపి తెచ్చిన పథకంతో పేదల ఉపాధికి గ్యారెంటీ లేదన్నారు. పైగా రోజువారి అవసరాలు, జనాభా పెరుగుతుంటే పట్టణ ప్రాంతాలకు ఉపాధి హామీ పెంచాల్సింది పోయి, ఉన్న పని దినాలు దెబ్బతీసే విధంగా చర్యలు ఉన్నాయన్నారు. ఉపాధి పనికి నిధులు 2,50,000 కోట్లు కేటాయింపులు చేయాలని 200 రోజులకు పని దినాలు పెంచాలని, రోజువారి కూలీ 800 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఉపాధి హామీ పని హక్కుల కోసం పేదలు ప్రత్యక్ష ఆందోళన కోసం రావాలని పిలుపునిచ్చారు.



# 10 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి...




**-స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి 18** 10వ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. బుధ వారం రోజు మోటకొండూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ , ఆలేరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో ఏర్పాటు చేసిన ఎస్ ఎస్ సి పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పరీక్షా కేంద్రంలో నిర్వహణ ఏర్పాట్లు , విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా , ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. పరీక్షా కేంద్రంలో తాగునీరు , విద్యుత్ , ఫ్యాన్లు తదితర అంశాల గురించి అడిగి తెలుసున్నారు. పరీక్ష పూర్తయిన తర్వాత పోలీస్ బందోబస్తుతో పరీక్ష పేపర్లను జాగ్రత్తగా తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనలో మంజీర మరమత్తులు



**జహీరాబాద్, మార్చి 18 (మన వార్త):** ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో మంజీర పైపు మరమత్తులు చేసి నీటి లీకేజీని అరికట్టారు. జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్కల్ మండల కేంద్ర గ్రామ పంచాయతీ లో గత మూడు సంవత్సరాలుగా మంజీర పైపు పగిలి నీరు వృథాగా పోతుంది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన 99 రోజుల ప్రగతి లో భాగంగా బుధవారం మంజీర పైపుకు మరమత్తులు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జ్యోతి లక్ష్మీ, కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, సర్పంచ్ ప్రతినిధి ప్రవీణ్ కుమార్ గ్రామ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకు కంట్రోలర్ లతో అదనపు కలెక్టర్ సమావేశం...



**-జిల్లాలో ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025-26 కు బ్యాంకులు అమలు లక్ష్యములకు ఆమోదం...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 18** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఆదేశానుసారము అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అధ్యక్షతన బుధవారం రోజు బ్యాంక్ కంట్రోలర్ అందరితో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లడుతూ ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025- 26 కు గాను బ్యాంకు ద్వారా అమలుచేయు జిల్లా లక్ష్యములను ఆమోదం పొందడం జరిగింది. బ్యాంకు ద్వారా అమలు పరచబడు పథకములకు లబ్ధిదారులను ఎంపిక చేసిన తదుపరి , వారికి బ్యాంక్ కాన్సెంట్ ఇవ్వాల్సినదిగా కోరడం జరిగినది. బ్యాంకు లోను , ఈవీ 2 వీలర్ యూనిట్ నకు 10 శాతం , ఈవీ 3 వీలర్ యూనిట్ నకు 30 శాతం , సోలార్ యూనివర్సల్ పంపు కంట్రోల్ యూనిట్ నకు 40 శాతం బ్యాంకు లోను ఇవ్వవలసి ఉంటుందని తెలియజేశారు. అందుకు బ్యాంక్ కంట్రోలర్ అందరూ ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జినుకల శ్యాం సుందర్ , లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శివ రామకృష్ణ , వంశీ , తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎస్బిఐ , కెనరా బ్యాంకు , యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇతర బ్యాంక్ కంట్రోలర్ లందరూ పాల్గొన్నారు.

# రామ మందిర నిర్మాణానికి ఎమ్మెల్యే భూపతి రెడ్డి గ్రీన్ సిగ్నల్ రావుట్ల గ్రామ ప్రతినిధులతో భేటీ



**నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం (మన వార్త) మార్చ్ 18** నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డిని ఆయన హైదరాబాద్ నివాసంలో రావుట్ల గ్రామ విలేజ్ కమిటీ సభ్యులు మరియు సర్పంచ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రావుట్ల గ్రామంలో రామ మందిర నిర్మాణం చేపట్టేందుకు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించారు. సంబంధిత అంశంపై అధికారులతో ఫోన్ ద్వారా చర్చించి అవసరమైన చర్యలు తీసుకునేలా సూచించారు. అలాగే గ్రామానికి సంబంధించిన పలు అభివృద్ధి విషయాలను కూడా ఎమ్మెల్యేతో చర్చించారు. ఈ కార్యక్రమంలో రావుట్ల సర్పంచ్ కొడిగేలా రాజు కుమార్, విడిసి చైర్మన్ నత్తి భూమయ్య, సభ్యులు కుమ్మరి రాజన్న, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# పంతంగి టోల్ ప్లాజా వద్ద 60.685 కీలోల ఎండు గంజాయి పట్టివేత...



**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 18** తేది. 17 మార్చి 2026 సోమవారం రోజున ఎక్సైజ్ ప్రోహిబిషన్ శాఖకు అందిన సమాచారం మేరకు ఉమ్మడి నల్గొండ జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎ. శ్రీనివాస్ రెడ్డి , డిస్ట్రిక్ట్ ప్రోహిబిషన్ , ఎక్సైజ్ అధికారి ఎం. విష్ణు మూర్తిల ఆదేశాల మేరకు ఆర్. బాలోజి నాయక్ ఎస్ హెచ్ ఓ రామన్నపేట,కె. రవిచంద్ర రెడ్డి ఎస్ హెచ్ ఓ, మోత్కూర్ గార్ల ఆధ్వర్యంలో పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహన తనిఖీలు నిర్వ హిస్తుండగా అను మానాస్పదంగా వస్తున్న ఒక ఆటో ను ఆపి తనిఖీ చేయగా దానిలో 60.685 కీలోల ఎండు గంజాయి లభ్యమైంది. ఇట్టి గంజాయి ని ఏ1) గంగా బాయ్ పాండు రంగ్ చౌహన్ R/o. మహారాష్ట్ర , ఏ2) కమల్ అర్జున్ మోహితే R/o. మహారాష్ట్ర , ఏ3) విజయ్ ఆసరం గోరపడే R/o. మహారాష్ట్ర , ఏ4) వల్లపు దాసు వేణు కుమార్ R/o. నల్గొండ అను వ్యక్తులు ఒడిశా రాష్టంలోని భరంపూర్ నుండి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకి తరలిస్తూ పట్టుబడినారు. తదుపరి విచారణ నిమిత్తం ఇట్టి గంజాయిని ,1 ఆటో , 2 మొబైల్ ఫోన్లు , ఇట్టి గంజాయి విలువ సుమారు రూ. 33 లక్షలు. రామన్నపేట ఎక్సైజ్ స్టేషన్ కి తరలించడం జరిగింది. ఈ తనిఖీలలో ఎస్ ఎన్. శంకర్ , బి. శివ కృష్ణ , పి. సత్యనారాయణ కాని స్టేబుల్స్ తిరుమలేష్ , రావొజీ , రహమాన్ , రమేష్ రెడ్డి , కృష్ణ రెడ్డి , గోపి , అనిల్ , వెంకట్ , సోనీ , స్వప్న లు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని వినతి



**బెజ్జంకి, మార్చి 18( మన వార్త ప్రతినిధి )**తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కరీంనగర్ బస్సు డిపో1 నుండి సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని తోటపల్లి,వీరాపూర్,లక్ష్మీపూర్,బేగంపేట,గూడెం గ్రామాల మీదుగా,బెజ్జంకి వరకు గ్రామస్థుల సౌకర్యార్థం మధ్యాహ్నం 12 గంటలకు వచ్చే బస్సు ట్రిప్ పునరుద్దరిచాలని బుదవారం రోజున కరీంనగర్-1వ డిపో రూట్ ప్లానింగ్ సీ.ఐ హిమబిందు ని కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బెజ్జంకి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ చిలివేరు శ్రీనివాస్ రెడ్డి, వీరపూర్ సర్పంచ్ చిలుముల సతీష్,ఉపసర్పంచ్ లు హరీష్ తిరుపతి రెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

# ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీక



**-బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గవ్వ వంశీధర్ రెడ్డి...**

**కోహెడ,మార్చి 18( మన వార్త ప్రతినిధి )**ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీక అని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గవ్వ వంశీధర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలోని మసీదులో గవ్వ కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మైనార్టీ సోదరులకు ఈ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష సందర్భంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం సంతోషకరమని ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి స్నేహభావానికి ప్రతీక అని అన్నారు .. కుల మతాలకు అతీతంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సామాజిక సేవా విద్యా వైద్య రంగాలలో సేవ కార్యక్రమాలు చేస్తున్నామని భవిష్యత్తులో మరింత సేవలు అందిస్తామని తెలియజేశారు అనంతరం మైనార్టీ సోదరులు వంశీధర్ రెడ్డి ని ఘనంగా సన్మానించారు. గవ్వ వంశీధర్ రెడ్డి ముస్లిం సోదరులకు ముందస్తుగా ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వలస సుభాష్ చంద్రబోస్ నేత, గుగ్గిళ్ళ కార్తీక్, గవ్వ వంశీధర్ రెడ్డి యువసేన అధ్యక్షుడు ఎండీ ఒవైస్,అబ్దుల్ రఫీ,తుఫాన్, శంషీర్,జాలిగాం శంకర్,మహమ్మద్ జాకీర్, మీర్జా ఆసిఫ్, జావిద్, షరీఫ్,మీర్జా అర్షద్,అక్తర్ పాషా,సమీర్, పోలవేణి కుమారస్వామి, గోవిందు వెంకటేశం, మహమ్మద్ సైఫుద్దీన్,కల్లికోట రాహుల్ ,జాలిగం అజయ్, ఇలియాస్,ఆర్రీఫ్,షోయబ్ మరియు పలు పార్టీల నాయకులు ముస్లిం మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

# కార్మికులకు అండగా నిలబడితేనే గుర్తింపు

**-కార్మికులకు ఇచ్చిన రంజాన్ తోఫా..**

**-కార్మికుల గౌరవ మర్యాదలకు ఇచ్చిన తొఫాగా భావించాలి...**

**-మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత...**

**-మున్సిపల్ కార్మికులకు ముస్లిం ఐక్య సంఘం ఆధ్వర్యంలో రంజాన్ తొఫా పంపిణీ...**

**మధిర, మార్చి 18( మన వార్త)**పారిశుధ్య నిర్వహణలో కార్మికుల సేవలను ప్రజలు గుర్తిస్తున్నారు అని మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాథం అన్నారు. బుధవారం తెలంగాణ ముస్లిం ఐక్య సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు




మౌలానా షేక్ ముజాహిద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ హుస్సేన్ సాహెబ్ లు పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకొని మధిర మున్సిపల్ కార్మికులకు కుల మతాలకు అతీతంగా రంజాన్ కానుకను (తొఫా) చైర్మన్ సామినేని సుజాత, వైస్ చైర్మన్ కోనధని కుమార్,మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ చేతుల మీదుగా కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ సుజాత మాట్లాడుతూ,ఒక ఇల్లు పరిశుభ్రంగా సుభిక్షంగా ఉండాలంటే,ఆ ఇంటి మహిళ ఉదయం,సాయంత్రం ఇంటిని శుభ్రపరుస్తూ, వస్తువును క్రమ పద్ధతిలో అమర్చుకోవాల్సి ఉంటుంది,మధిర మున్సిపాలిటీ అనే ఇంత పెద్ద ఇంటిని శుభ్రంగా ఉంచాలి అంటే అది ఒక్క పారిశుద్ధ్య కార్మికులతోనే సాధ్యమవుతుందని అన్నారు. ఒక ఇంటికి మహిళా ఎంత ముఖ్యమో, మున్సిపాలిటీ కి కార్మికులు అంతే ముఖ్యం అన్నారు. కార్మికుల లేకపోతే నగరాలు,పట్టణాలు చెత్తా చెదారంతో నిండిపోయి, ప్రజారోగ్యం తీవ్రంగా దెబ్బతింటుంది అని తెలిపారు. అలాంటి కార్మికులను గౌరవించుకోవడం మనందరి బాధ్యత అని ఆ దిశగానే ముస్లిం ఐక్య సంఘం పెద్దలు ముజాహిద్,హుస్సేన్ లు ఆలోచన చేసి రంజాన్ పండుగ కానుకలు అందించడం అభినందనీయమని అన్నారు. ఐక్య సంఘం అందించిన తోఫాని కార్మికులు గౌరవ మర్యాదలకు ఇచ్చిన కానుకగా భావించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ రసీదున్,ముస్లిం ఐక్య సంఘం పట్టణ అధ్యక్షులు సయ్యద్ రసీదు,మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# కన్న కొడుకు అవయవాలను దానం చేసిన తల్లికి సెల్యూట్...



**చిన్న శంకరంపేట మార్చి 18( మన వార్త ప్రతినిధి)** తాను మరణించి ఐదుగురికి జీవం పోశాడు ఓ యువకుడు కన్న కొడుకు మృతి చెంది కడుపు కోతతో ఉండి కూడా పుట్టాడు దుఃఖాన్ని దిగమించుకొని తన కుమారుని అవయవాలను దానం చేసి ఐదుగురు ప్రాణాలను కాపాడింది ఓ మాతృమూర్తి చిన్న శంకరంపేట మండలం మిర్జాపల్లి గ్రామానికి చెందిన కుంట కళావతి కుమారుడు సందీప్ కుమార్ 28 ఈనెల 12న మిర్జాపల్లి నుండి చిన్న శంకరంపేటకు బైక్ పై వస్తుండగా ప్రమాదవశత్తు కింద పడిపోయి తలకు తీవ్ర గాయాలు వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాదులోని కిమ్స్ దావకానకు తరలించారు కిమ్స్ దావఖానలో చికిత్స పొందుతూ మంగళవారం సందీప్ కుమార్ బ్రెయిన్ డెడ్ గురయ్యాడు అవయవాలు ఇతరులకు ఉపయోగపడతాయని వైద్యులు సూచించడంతో తల్లి కళావతితన కుమారుని అవయవాలను దానం చేసి ఐదుగురి ప్రాణాలను కాపాడారు అవయవ దానం చేసిన ఆ మాతృమూర్తిని పలువురు అభినందించారు

# పిఆర్సి, డీఏలపై గెజిటెడ్ అధికారుల డిమాండ్...



**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 18** యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై వచ్చిన వార్తల ప్రభావంతో తెలంగాణ గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ కార్యవర్గం సమావేశం అయింది. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశానికి రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు మందడి ఉపేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 నుండి అమలు కావలసిన పి.ఆర్.సిని వెంటనే అమలు చేయాలని , పెండింగ్ లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బకాయిలు అందక ఇబ్బందులను ఎదుర్కొంటున్న విశ్రాంతి ఉద్యోగుల పరిస్థితి పై ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ఉద్యోగుల ఆరోగ్య పథకం ఏప్రిల్ 1 2026 నుండి అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని , అన్ని శాఖల్లో ప్రమోషన్ కమిటీలను ఏర్పాటు చేసి అర్హులకు పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా అధ్యక్షుడు సీ. జగన్మోహన్ ప్రసాద్ మాట్లాడుతూ జిహెచ్ఎంసి పరిధికి సమీపంలో పనిచేస్తున్న ఉద్యోగులకు 24 శాతం హెచ్ ఆర్ ఏ లను చెల్లించాలని ఇప్పటికే పలుమార్లు వినతిపత్రం ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఉద్యోగుల సమస్యలను జిల్లా , రాష్ట్రస్థాయికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. జిల్లా కార్యదర్శి సి. హెచ్ శ్రీనివాస్ పదోన్నతి పొందిన సందర్భంగా కార్యవర్గం తరపున ఆయనకు ఘన సన్మానం చేయడం జరిగింది. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లాలో 68వ ర్యాంకు సాధించిన క్రితిక్....



**చిన్న శంకరంపేట మార్చి 18(మన వార్త ప్రతినిధి )** చిన్న శంకరంపేట మండలం చందంపేట గ్రామానికి చెందిన రెడ్డబోయిన నర్సింలు మంజుల ల కుమారుడు క్రితిక్ చేగుంట మండల కేంద్రంలోని బ్రిలియంట్ స్కూల్లో విద్యను అభ్యసిస్తున్నాడు, విద్యార్థి తండ్రి కుటుంబం మొత్తం వ్యవసాయం మీదనే ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు పేద కుటుంబానికి చెందిన క్రితిక్ గత ఏడాది డిసెంబర్లో నిర్వహించిన నవోదయ ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష రాయడం జరిగింది మంగళవారం విడుదలైన పరీక్ష ఫలితాలలో ఉమ్మడి మెదక్ జిల్లాలో విద్యార్థి క్రితిక్ 68వ ర్యాంకు సాధించి తన సత్తా చాటాడు, పట్టుదలతో విద్యార్థి క్రితిక్ మంచి ఫలితాన్ని సాధించాడు ఉమ్మడి మెదక్ జిల్లాలో అరవిన్యూర్ యాంకర్ సాధించిన విద్యార్థిని ఉపాధ్యాయులు గ్రామస్తులు అభినందించారు.

## గంగా అవెన్యూలో నీటి నిల్వ డ్రైనేజ్ సమస్యలపై మైనంపల్లి హనుమంతరావు పరిశీలన



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మార్చి 18 మన వార్త:** అల్వాల్ సర్కిల్ 190 డివిజన్ మచ్చ బొల్లారం పరిధిలోని గంగా అవెన్యూ, ఎంఈఎస్ కాలనీ, కాశీపురం, శ్రీనివాసిక కాలనీ తదితర ప్రాంతాల్లో నెలకొన్న నీటి నిల్వ మరియు కాల్వల సమస్యలపై ప్రముఖ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు స్థానిక ప్రజల వినతిపై స్పందిస్తూ ప్రభుత్వ అధికారులతో కలిసి స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీలలో కొనసాగుతున్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించిన ఆయన, ముఖ్యంగా తక్కువ ఎత్తులో ఉన్న ప్రాంతాలు మరియు గంగా అవెన్యూ పరిధిలోని పాత గుంతల (క్వారీ పిట్స్) కారణంగా తీవ్రంగా నీరు నిల్వవుతుందని గుర్తించారు. వర్షాకాలంలో ఈ పరిస్థితి మరింత తీవ్రమవుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నదని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు స్థానిక నివాసితులు మాట్లాడుతూ, తమ కాలనీల్లో ఇప్పటివరకు సరైన స్టార్మ్ వాటర్ డ్రైన్స్, బాక్స్ డ్రైన్స్ ఏర్పాటు కాలేదని, అలాగే డ్రైనేజ్ పైపులైన్ పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ప్రతి వర్షానికి రోడ్లు చెరువుల్లా మారి, రాకపోకలకు అంతరాయం కలుగుతోందని తెలిపారు. ఈ సమస్యలపై స్పందించిన మైనంపల్లి హనుమంతరావు వెంటనే సంబంధిత ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ విజయ కృష్ణ రెడ్డి, ఐఏఎస్ మరియు మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, ఐఏఎస్ గారితో చర్చించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన అనుమతులు, నిధుల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఈ సందర్భనలో వాటర్ బోర్డు జనరల్ మేనేజర్ సునీల్, డిప్యూటీ కమిషనర్ భోగేశ్వర్లు, జీహెచ్ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, డీఈ ప్రశాంత్, డీజీఎం సాంబయ్య, వెంకటేశ్వర రెడ్డి, ఏఈ రావళి, అలాగే మేనేజర్లు సుజయ్, రమేష్ తదితర జూనియర్ అధికారులు పాల్గొన్నారు. అలాగే కాలనీ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు జోసెఫ్ రెడ్డి, సంతోష్ రెడ్డి, రెహ్మాన్, ఆంజనేయులు, మహిపాల్ రెడ్డి, మన్మథ రెడ్డి, సుమన్ రెడ్డి, రజని, లక్ష్మీ ప్రసన్న తదితరులు హాజరై తమ సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేందర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, లడ్డూ రెడ్డి, శ్రీనివాస్, వెంకట్, స్వామి, సహదేవ్, దిలీప్, సందీప్ రెడ్డి, సంపత్ యాదవ్, సుధర్శన్, మన్మోహన్, వెంకటేష్, రఘు, నర్సింగ్, నవీన్, శకుంతల తదితరులు కూడా పాల్గొన్నారు. స్థానిక సమస్యలపై తక్షణ స్పందనతో ముందుకు వచ్చిన మైనంపల్లి హనుమంతరావు చర్యలను ప్రజలు అభినందించారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## బంగారు పుష్పాలతో శ్రీవారికి అష్టదళ పాదపద్మార్చన...





**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 18** తెలంగాణలోని ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన యాదాద్రి తిరుమల స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం లో బుధవారం రోజు ఉదయం 108 బంగారు పుష్పాలతో అష్టాదశ పద్మార్చన సేవను ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నిత్య కళ్యాణోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు దిట్టకవి శ్రవణ చార్యులు దివ్య కరములచే అంగరంగ వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపుష్ప దర్శనాన్ని భక్తులకు కల్పించారు. ఉదయం 5:45 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామివారికి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో సువర్ణ బిందె తీర్థంను బంగారు బావి నుండి శ్రద్ధాభక్తులతో తీసుకువచ్చారు. ఉదయం 7 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మణిమయ శోభిత స్వర్ణాభరణాలతో, పరిమళభరిత పుష్పమాలల తో శోభాయ మానంగా అలంకరించి, వేయి నామాలతో శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. సకల దోష నివారణార్థం అమావాస్యని పురస్కరించుకొని అర్చకులు శ్రీ సుదర్శన నారసింహ హవనాన్ని ఘనంగా నిర్వహించారు. బుధ వారం సందర్భంగా స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య పాదార విందములకు ఒక వంద ఎనిమిది బంగారు అష్టదళ పద్మ పుష్పాలతో, శ్రీ స్వామివారికి అష్టోత్తర శతనామాలతో అష్టదళ పాదపద్మార్చన సేవను నిర్వహించారు. భక్తులు శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ఆనంద పరవశు లయ్యారు. స్వామి వారి నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో భాగంగా నేడు సుమారు 2000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం 6:30 గంటలకు ఆదిమధ్యాంతరహితుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయమానంగా ఊరేగిస్తూ తిరువీధి ఉత్సవ సేవను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. ఈరోజు శ్రీ స్వామివారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు ఆలయ చైర్మన్లు మానేపల్లి మురళీకృష్ణ గోపికృష్ణలు తెలిపారు.

## వినియోగదారులకు తప్పని గ్యాస్ తిప్పలు...



**చిన్న శంకరంపేట మార్చి 18( మన వార్త ప్రతినిధి )**గ్యాస్ వినియోగదారులకు గ్యాస్ దొరకక తిప్పలు తప్పడం లేదు సమయానికి గ్యాస్ దొరకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు, చిన్న శంకరంపేట మండల కేంద్రానికి బుధవారం గ్యాస్ సరఫరా చేసే ఆటో డ్రైవర్ ఇంటి వద్దకే జనం భారీగా ఎగబడ్డారు గ్యాస్ బుక్ చేసుకున్న వారు నేరుగా ఆటో వద్ద వేచి చూస్తున్నారు సిలిండర్లు వచ్చిన కొద్ది నిమిషాల వ్యవధిలోనే స్టాక్ అయిపోవడంతో చాలామంది వినియోగదారులు గ్యాస్ దొరకక నిరాశతో వెనుదిరిగిపోయారు, గ్యాస్ సరఫరా క్రమబద్ధీకరించాలని ప్రజలు కోరుతున్నారు.

## అల్వాల్ సర్కిల్‌లో అమావాస్య అన్నదానం కార్యక్రమం ఘనంగా నిర్వహణ



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మార్చి 18 మన వార్త :**అల్వాల్ సర్కిల్ పరిధిలో అమావాస్య సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొని భోజనం స్వీకరించారు. ప్రతి అమావాస్య రోజున సంప్రదాయంగా నిర్వహించే ఈ అన్నదాన కార్యక్రమం, అవసరమైన వారికి ఆహారం అందించడమే లక్ష్యంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా సంఘ సభ్యులు స్వయంగా ముందుకు వచ్చి భక్తులకు భోజనం వడ్డించడం విశేషంగా నిలిచింది. కార్యక్రమంలో పాల్గొన్న సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ, సమాజ సేవలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరింత విస్తృత స్థాయిలో సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. స్థానికులు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, ఆర్యవైశ్య సంఘం చేపడుతున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. ముఖ్యంగా పేద మరియు నిరుపేదలకు ఇలాంటి అన్నదాన కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, వాలంటీర్లు, స్థానిక ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్యంగా బెల్లి రమేష్, బాబు నాగేష్, మంచాల రవీందర్, అనిత సత్యం, తడక వెంకటేష్, గుండా జగదీశ్, గుండవల్లి శ్రీనివాస్, తుడుపునూరి బాలేష్, నేతి రమేష్, పిన్నింటి లక్ష్మీనారాయణ, మంచికొండ నాగేందర్, సంగమూరి సత్యనారాయణ, ప్రొడుటూరి శంకర్, అంజయ్య, బచ్చి ప్రసాద్, శ్రీనివాస్, నాగేందర్, నాగేశ్వర్, ఉప్పల లక్ష్మణ్, కొమరవెల్లి రాజు, చిరుత సత్యనారాయణ, రెడ్డిపల్లి వెంకటేష్, రాజేందర్, మంచాల ప్రభాకర్, కాముని సంతోష్, దాముకొండ శ్రీనివాస్, దాముకొండ రామచందర్, బెల్లి మంచుకోటి నాగేశ్వర్, అమర బాలేష్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

## సిరికొండ ఆదర్శ పాఠశాలలో ఘనంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ పతాకావిష్కరణ



**నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం(మన వార్త) మార్చి 18** సిరికొండ మండల కేంద్రంలోని పీయం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల కళాశాలలో ఈరోజు స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగం ఆధ్వర్యంలో పతాకావిష్కరణ కార్యక్రమం అత్యంత ఉత్సాహభరితంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ మరియు గైడ్ కెప్టెన్ల సమక్షంలో విద్యార్థిని పారిపెల్లి శ్రీనిత చేత ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయ బృందం ముందుగా స్కౌట్స్ అండ్ గైడ్స్ పతాకాన్ని ఆవిష్కరించి వందనం సమర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి గారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, "విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, సేవాభావం మరియు దేశభక్తిని పెంపొందించడంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ పాత్ర ఎంతో కీలకం. ఇది కేవలం ఒక విభాగం మాత్రమే కాకుండా, బాధ్యతాయుతమైన పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దే గొప్ప వేదిక" అని పేర్కొన్నారు. కష్టకాలంలో ఇతరులకు సహాయం చేయడం, నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవడం, సామాజిక స్పృహ కలిగి ఉండడం ఈ విభాగం ముఖ్య లక్ష్యాలుగా ఆయన వివరించారు. తదుపరి విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన పరేడ్ నిర్వహించి, సమాజ సేవకు కట్టుబడి ఉంటామని, సత్ప్రవర్తనతో మెలుగుతామని సమిష్టిగా ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన క్రమశిక్షణ అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి, స్కౌట్ మాస్టర్ పీడీ నక్క కిషన్, గైడ్ కెప్టెన్ వికృరి అనీలతో పాటు ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## టి యు డబ్ల్యు జె ఐ జేయు ఆధ్వర్యంలో డి పి ఆర్ ఓ అరుంధతికి ఘన సన్మానం...



**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 18** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టియుడబ్ల్యూజే ఐజేయు ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా డి పి ఆర్ ఓ యు. అరుంధతిని బుధవారం రోజు కలెక్టరేట్లో ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు శాలువా కప్పి మెమొంటోను అందజేశారు. ఈ సందర్భంగా డిపిఆర్ఓ మాట్లాడుతూ మహిళా జిల్లా అధికారినిగా టీయుడబ్ల్యూజే (ఐ జే యు) ఆధ్వర్యంలో సన్మానించి గౌరవించినందుకు యూనియన్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు యంబ. నరసింహులు, జిల్లా కార్యదర్శి పోతంశెట్టి కరుణాకర్, ఐజేయు కౌన్సిల్ మెంబర్ జీవి. శ్రీనివాస్, టీయూడబ్ల్యూజే స్టేట్ కౌన్సిల్ మెంబర్, అక్రిడేషన్ కమిటీ మెంబర్ వెలిమినేటి. జహంగీర్, యూనియన్ జిల్లా మాజీ అధ్యక్షులు జి కృష్ణారెడ్డి, యూనియన్ నాయకులు కందుకూరు సోమయ్య, పురుగుల మల్లేశం, గుండు ప్రసాద్, తాళ్ల భాస్కర్ పాల్గొన్నారు.

# ముస్తాబాద్ మండలంలో విషాదం...

### ట్రాక్టర్ ఢీకొని మూడేళ్ల బాలుడు మృతి

**ముస్తాబాద్:-**ఆడుకోవాల్సిన వయసులో ఆ చిన్నారి అనంతలోకాలకు వెళ్లిపోయాడు. కళ్లముందే తిరుగుతూ సందడి చేసే కొడుకు విగతజీవిగా పడి ఉండటం చూసి ఆ తల్లిదండ్రుల గుండెలు పగిలాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం మొర్రాపూర్ గ్రామ పరిధిలోని తండాలో బుధవారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా, ముస్తాబాద్ మండలం, మొర్రాపూర్ గ్రామానికి చెందిన భూక్య ఇషాన్ అనే బాలుడు తన ఇంటి ముందర ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో





అకస్మాత్తుగా అటుగా వచ్చిన ఒక ట్రాక్టర్ బాలుడిని బలంగా ఢీకొట్టింది. ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఇషాన్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. తండాలో మిన్నంటిన రోదనలు చిన్నారి మరణవార్త తెలియగానే తండా మొత్తం విషాదంలో మునిగిపోయింది. అప్పటివరకు తమ కళ్లముందే ఆడుకున్న బాలుడు విగతజీవిగా మారడంతో స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు. ముఖ్యంగా తల్లిదండ్రుల రోదనలు చూసి అక్కడి వారందరి కళ్లు చెమర్చాయి. డ్రైవర్ అజాగ్రత్తే ఈ ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది. ఒక్కగానొక్క కొడుకు దూరం కావడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

## శ్రీ పరాభవ నామ సంవత్సరం శుభాకాంక్షలు భక్తులకు వేదాశీర్వచనంతో శుభాశీస్సులు

### సదానిరంజన్ సిద్ధాంతి ఆలయ అర్చకులు

**ఎల్కతుర్తి మార్చి18 మన వార్త ప్రతినిధి** తెలుగు నూతన సంవత్సరమైన ఉగాది సందర్భంగా ప్రారంభమవుతున్న శ్రీ పరాభవ నామ సంవత్సరం (2026-2027) కు వల్బాపూర్ గ్రామంలోని శ్రీ పశుపతినాథ్ స్వామి దేవస్థానం ఆలయ అర్చకులు సదానిరంజన్



సిద్ధాంతి భక్తులకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పండుగతోనే కొత్త తెలుగు సంవత్సరం ప్రారంభమవుతుందని, ఈ సంవత్సరం పేరు పరాభవ నామ సంవత్సరం అని పంచాంగంలో పేర్కొనబడిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం ఉగాది రోజున ఆలయాలలో పంచాంగ శ్రవణం నిర్వహించడం సంప్రదాయమని, భక్తులు దేవుని దర్శనం చేసుకుని వేదాశీర్వచనాలు పొందడం ద్వారా సంవత్సరాన్ని శుభంగా ప్రారంభించుకోవాలని సూచించారు. ఉగాది పండుగ వసంత ఋతువు ఆరంభాన్ని సూచించే పర్వదినంగా భావించబడుతూ, కొత్త ఆశలు, కొత్త సంకల్పాలకు శ్రీకారం చుట్టే రోజు అని వివరించారు. శ్రీ పశుపతినాథ్ స్వామి అనుగ్రహంతో ఈ నూతన సంవత్సరంలో భక్తులందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, శాంతి, సంతోషాలు కలగాలని ఆయన ప్రార్థించారు. సమాజంలో సత్సంకల్పాలు పెరిగి, ప్రజలందరూ ధర్మమార్గంలో నడుచుకుంటూ సుఖసంతోషాలతో జీవించాలని వేద మంత్రాలతోఆశీర్వదించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, భక్తులు మరియు యావత్ ప్రజానీకానికి శ్రీ పరాభవ నామ సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి ఒక్కరు సనాతన సంప్రదాయాలను పాటిస్తూ ఆధ్యాత్మికతతో జీవించాలని కోరారు.

# మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

- తహసిల్దార్ సురేఖ...

**శంకరపట్నం:మార్చి18(మన వార్త ప్రతినిధి)**పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం



ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మతసామరస్యానికి ప్రతీక అని తహసిల్దార్ సురేఖ అన్నారు. శంకరపట్నం మండలం వంకాయగూడెం పరిధిలోని మాధవ సాయి గార్డెన్ లో ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లింల కోసం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలు ఫలహారాలు తిని ఉపవాస దీక్ష విరమించారు. సర్వ మత సారం ఒకటేనని, మనుషులంతా సోదరభావంతో ఉండాలని ఎమ్మార్వో సురేఖ సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోవగోని బన్నయ్య గౌడ్, హుజురాబాద్ ఏఎంసి వైస్ చైర్మన్ నాంపెల్లి తిరుపతి, కేశవపట్నం సర్పంచ్ రాజేంద్రప్రసాద్, ఉప సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడు గొట్టె మధు, నాయకులు ఉప్పుగళ్ల మల్లారెడ్డి, హిస్సామోద్దీన్, షారుక్, అమీర్, మోయిన్, జావీద్, ఆయా గ్రామాల మజీద్ కమిటీ సభ్యులు ముస్లిం సోదరులు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌పై తప్పుడు ప్రచారాలు ఆపాలి



**-మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్...**

**వేములవాడ మార్చి 18 (మన వార్త )**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్‌పై తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదని వేములవాడ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ఆది శీనన్న ధరించే వాచ్ కోటి రూపాయలదని కొంతమంది వ్యక్తులు సోషల్ మీడియా వేదికగా, వివిధ ఛానళ్లలో ఫేక్ న్యూస్ ద్వారా ప్రచారం చేయడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. ఈ నకిలీ ప్రచారాల వెనుక కేటీఆర్, హరీష్ రావుల హస్తముందని ఆరోపించారు. ప్రజల్లో నిత్యం ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించే ప్రజానాయకుడైన ఆది శ్రీనివాస్‌పై బురదజల్లే రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సాధారణ కార్యకర్తగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించి, నేడు ప్రభుత్వ విప్‌గా రాష్ట్రవ్యాప్తంగా మన్ననలు పొందుతున్న నాయకుడు ఆది శ్రీనివాస్ అని కొనియాడారు. బీసీ నాయకుడిగా ఎదుగుతున్న ఆయనపై అసత్య ప్రచారాలు చేయడం దురదృష్టకరం అని అన్నారు. తప్పుడు వార్తలను ప్రసారం చేసిన టీవీ యాజమాన్యం వెంటనే క్షమాపణలు చెప్పాలని కనికరపు రాకేష్ డిమాండ్ చేశారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



**-కలెక్టర్ గరిమ అగ్రవాల్...**
**-గంభీరావుపేట సీహెచ్ సీని పరిశీలించిన కలెక్టర్...**

**గంభీరావుపేట, మార్చి -18 (మన వార్త )**రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీ హెచ్ సీ)లో కలెక్టర్ బుధవారం పరిశీలించారు. పలువురు రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో ఏ ఏ సేవలు అందుబాటులో ఉన్నాయో వైద్యుల నుంచి వివరాలు తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఇన్ పేషెంట్ వార్డులు, మందులు ఇచ్చే గది, స్టోర్ రూమ్, వ్యాక్సినేషన్ గది, ఎక్స్ రే గది, యునాని హాస్పిటల్, ఆసుపత్రి ఆవరణ అంతా పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణ శుభ్రంగా ఉండాలని ఎంపీడీఓకు సూచించారు. ఆసుపత్రిలో అవసరమైన మరమ్మత్తు పనులు చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ వైద్య సేవలపై అవగాహన కల్పించాలని తెలిపారు.కార్యక్రమంలో టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్ కుమార్, జిల్లా వైద్య అధికారి రజిత, డీసీ హెచ్ ఎస్ రవీందర్, సర్పంచ్ మల్లుగారి పద్మ, తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీవో రాజేందర్, డాక్టర్ సృజన్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## బెజ్జంకి మండల రెవిన్యూ అధికారులు ముస్లిం సోదరులకి ఇఫ్తార్ విందు ఏర్పాటు





**బెజ్జంకి ,మార్చి 18( మన వార్త ప్రతినిధి )** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని నర్మద ఫంక్షన్ హాల్లో బెజ్జంకి మండల రెవిన్యూ తహసిల్దార్ కళ్యాణపు శ్రీకాంత్, తమ రెవిన్యూ సిబ్బంది ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనార్టీ సోదరులకు ఈ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష సందర్భంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం సంతోషకరమని ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి స్నేహభావానికి ప్రతీక అని అన్నారు.అనంతరం ముస్లిం సోదరులకు ముందస్తుగా ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మహమ్మద్ షాదిక్, పులి రమేష్, షాబుద్దీన్, నిజాముద్దీన్, సర్పంచ్ పెద్దన్న, శనగొండ స్వరూప, సమీర్ ఖలీల్, జంగిలి లక్ష్మి తిరుపతి, జెట్టి రమేశ్, బిగుళ్ళ మోహన్, గజ రవళి, ఉపసర్పంచ్ దుమాల మహేష్, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ పండుగ వేళ శాంతి భద్రతలపై పోలీసుల నిఘా: ముస్లిం మత పెద్దలతో భేటీ

**-ప్రశాంతంగా పండుగ జరుపుకోవాలి: డిఎస్పి శ్రీనివాసులు, సీఐ వీర ప్రసాద్....**

**వేములవాడ మార్చి 18 (మన వార్త )**రాబోయే రంజాన్ పండుగను పురస్కరించుకుని శాంతి భద్రతల పరిరక్షణలో



భాగంగా వేములవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ముస్లిం మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్డీపీఓ (SDPO) శ్రీనివాసులు, సీఐ వీర ప్రసాద్, ఎస్ఐ ఎల్ల గౌడ్ హాజరై పండుగ ఏర్పాట్లు మరియు భద్రతా అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రంజాన్ పండుగను అందరూ సోదరభావంతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు.ఎపండుగ వేళ ఎటువంటి అపోహలకు, వివాదాలకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ పరస్పరం సహకరించుకోవాలని కోరారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ పండుగ నిర్వహణలో పోలీసులకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు మత పెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆంగ్లం పై విద్యార్థులు పట్టు సాధించాలి..

**జమ్మికుంట, మార్చి 18( మన వార్త ప్రతినిధి):**విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొపెసర్ బీ.రమేష్ అన్నారు. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ , పీజీ కళాశాలలో ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన రెండురోజుల "ఆంగ్ల భాష ఉచ్చారణ పై చర్చాగోష్టి" కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈసంధర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆంగ్ల భాషా ప్రాముఖ్యత గురించి వివరించారు. నేటి సమాజంలో ఆంగ్ల భాషపై పట్టు ఉంటే ఉద్యోగ అవకాశాలలో రాణిస్తారని చెప్పారు. అనంతరం విద్యార్థులకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. కాగ రెండవ రోజు విద్యార్థులకు ఆంగ్ల భాష ఉచ్చరణపై హనుమకొండ కాకతీయ డిగ్రీ కళాశాల ఆంగ్ల అసోసియేట్ ప్రొపెసర్ పి. దినకర్ మాట్లాడుతూ విద్యార్థులు ఆంగ్ల భాషా పై నైపుణ్యం పెంపొందించు కొవాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కో - ఆర్డికేటర్ డాక్టర్ ఎస్. ఓదెలు కుమార్, ప్రోగ్రాం కో-కో ఆర్డినేటర్ ఉమాకిరణ్, అకడమిక్ కో -ఆర్డినేటర్ డాక్టర్ కె. రాజేంద్రం, డాక్టర్ కె. మాధవి, వి. కిరణ్ కుమార్, ఎన్. మమత,ఎన్. శ్రీనివాస్, ఎంబాడి రవి, పి. శ్రీనివాస్ రెడ్డి,.పి.సుష్మ, డా.పి. రవి ప్రకాశ్ రావు, ఎ.రమేష్, ప్రశాంత్, సాయికుమార్,అనూష, అరుణ్ రాజ్,.పి.స్వప్న,సీనియర్ అసిస్టెంట్ తిరుపతి, శ్రీకాంత్, రఘు, ప్రశాంతి, శ్రీలత, గౌరమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి చేపల వ్యాధులపై అవగాహన..



**జమ్మికుంట,మార్చి 18( మన వార్త ప్రతినిధి):**తెలంగాణ రాష్ట్రంలో మంచినీటి చేపల వ్యాధులపై రైతులకు అవగాహన కార్యక్రమం బుధవారం ప్రకాశం కృషి విజ్ఞాన్ కేంద్రంలో నిర్వహించారు. ఖమ్మం జిల్లా పాలేరు ఫిషరీస్ రీసెర్చ్ స్టేషన్‌కు చెందిన శాస్త్రీయ బృందం రవీందర్, డాక్టర్. అరుణ్ కొండూరి, నాగరాజు, కుమారి దివ్య , ఎన్ ఎస్ పి ఏ ఏ డి దశII ప్రాజెక్టు కింద కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లాకు చెందిన 28 మంది క్రియాశీల చేపల రైతులు, మత్స్యకారులు పాల్గొన్నారు. కార్యక్రమం నిర్వహణకు ప్రకాశం కృషి విజ్ఞాన్ కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ ఎన్. వెంకటేశ్వరరావు సహకారం అందించి ముఖ్య అతిథిగా పాల్గొని, శాస్త్రీయ విధానాలతో చేపల పెంపకం చేపడితే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని తెలిపారు. ప్రారంభోత్సవం అనంతరం శాస్త్రీయ బృందం ఆక్వాకల్చర్‌కు సంబంధించిన పలు కీలక అంశాలను వివరించారు. ముఖ్యంగా నీటి నాణ్యత ప్రమాణాలు, జీవభద్రతా చర్యలు, చేపలలో కనిపించే ప్రధాన వ్యాధులు మరియు వాటి నివారణ మరియు నిర్వహణ పద్ధతులపై సమగ్రంగా వివరించారు. అదనంగా, వ్యాధి నిర్ధారణలో జాగ్రత్తలు, సమయానికి చికిత్స, పోషకాహారం ప్రాముఖ్యత వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా రైతుల్లో శాస్త్రీయ అవగాహన పెంపొందడమే కాకుండా, చేపల ఆరోగ్య నిర్వహణ మెరుగుపడి ఉత్పాదకత పెరగడానికి సహకరిస్తుందని నిర్వాహకులు తెలిపారు. పాల్గొన్న రైతులు కార్యక్రమంపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను తరచుగా నిర్వహించాలని కోరారు.

## ఇఫ్తార్ విందు..



**జమ్మికుంట, మార్చి 18( మన వార్త ప్రతినిధి):**ముస్లిం సోదరులకు అత్యంత పవిత్రమైన పండుగ రంజాన్ పండుగ,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని సువర్ణ ఫ్యాంక్షన్ హాలు లో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.తహసిల్దార్ వెంకట్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ స్వప్నా సదానందం,మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్ కుమార్ ( దిలీప్),వైస్ చైర్మన్ జావిద్ పలువురు పాల్గొని ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ సోదరులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, ముస్లిం మైనార్టీ నేతలు, మైనార్టీ సోదరులు పలువురుతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమములో మజీద్ కమిటీ చైర్మన్,పలు గ్రామాల సర్పంచులు,ప్రముఖులు,నాయకులు,గిర్దవర్లు,ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## గర్భనిరోధక మాత్రలు క్యాన్సర్ ప్రమాదమా?



**డెస్క్,** గర్భనిరోధక మాత్రలు క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయా అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. గర్భధారణను నివారించేందుకు ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా ఉపయోగించే ఈ మాత్రలు శరీరంలోని హార్మోన్లను ప్రభావితం చేసి పనిచేస్తాయి. అయితే ఇవి నిజంగా క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయా అనే అంశంపై అనేక పరిశోధనలు జరిగాయి. అందులో కొన్ని విషయాలు స్పష్టమయ్యాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పించే పరిశోధనా సంస్థల నివేదికల ప్రకారం గర్భనిరోధక మాత్రలు ప్రధానంగా రెండు రకాలుగా ఉంటాయి. ఒకటి కంబైన్డ్ మాత్రలు, ఇందులో ఈస్ట్రోజెన్ మరియు ప్రొజెస్టోజెన్ అనే రెండు హార్మోన్లు ఉంటాయి. మరొకటి మినీ మాత్రలు, ఇందులో కేవలం ప్రొజెస్టోజెన్ మాత్రమే ఉంటుంది. ఈ మాత్రలు మహిళల శరీరంలో హార్మోన్ల సమతుల్యతను మార్చి అండోత్పత్తిని నియంత్రించడం ద్వారా గర్భధారణను నివారించడంలో సహాయపడతాయి.పరిశోధనల ప్రకారం కంబైన్డ్ గర్భనిరోధక మాత్రలు తీసుకునే మహిళల్లో రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం కొద్దిగా పెరిగే అవకాశం ఉందని సూచనలు ఉన్నాయి. అయితే ఈ ప్రమాదం ఎక్కువ కాలం కొనసాగదని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా ఈ మాత్రలను తీసుకోవడం ఆపిన తర్వాత కొంతకాలానికి శరీరం మళ్లీ సహజ స్థితికి చేరుకుంటుంది. దాదాపు పది సంవత్సరాల తర్వాత ఈ ప్రమాదం మాత్రలు ఎప్పుడూ వాడని వారితో సమానంగా మారుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే మరోవైపు ఈ మాత్రలు కొన్ని క్యాన్సర్ రకాల ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా సహాయపడుతాయని నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా గర్భాశయ లోపలి పొర క్యాన్సర్ మరియు గర్భాశయ గడ్డల క్యాన్సర్ వచ్చే అవకాశాలను తగ్గించడంలో ఇవి ఉపయోగకరంగా ఉండొచ్చని అధ్యయనాలు చెబుతున్నాయి. అందువల్ల గర్భనిరోధక మాత్రలను స్వయంగా వాడటం కన్నా వైద్యుల సూచనలతో మాత్రమే ఉపయోగించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## పెట్రోల్, డీజిల్ నిల్వ చేసుకోవడంపై ముఖ్యమైన సమాచారము




**హైదరాబాద్,** +ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య ఉత్పన్నమయిన ఉద్రిక్తతలు, గల్ఫ్ ప్రాంతంలోని హర్మూజ్ జలసంధిలో అంతరాయం వల్ల ప్రపంచవ్యాప్తంగా గ్యాస్, ముడి చమురు సరఫరాలో సమస్యలు నెలకొన్నాయి. ప్రపంచవ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తుల్లో 20□25 శాతం రవాణా హర్మూజ్ జలసంధి ద్వారానే జరుగుతుంది. దీని ప్రభావం భారత్‌పై కూడా పడింది. ఇప్పటికే దేశంలో గ్యాస్ ధరలు పెరిగాయి. త్వరలో పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెరగవచ్చనే ఆందోళనలు ఉన్నాయి. కొన్ని మంది అప్రమత్తమై ముందుగానే పెట్రోల్, డీజిల్ నిల్వ చేసుకుంటున్నారు. అయితే వీటిని నిల్వ చేయడం చట్టబద్ధమా? ఎంతకాలం నిల్వ చేయవచ్చు? అనే విషయాలు ఇలా ఉన్నాయి.వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ నిబంధనల ప్రకారం, క్లాస్ ఏ రకానికి చెందిన పెట్రోలియంను అమ్మకం కోసం కాకపోతే 30 లీటర్ల వరకు నిల్వ చేసుకోవడానికి లైసెన్స్ అవసరం లేదు. 30 లీటర్లకంటే ఎక్కువ నిల్వ చేయడం చట్టబద్ధంగా నిషేధం. వ్యాపార అవసరం కాకుండా ఎక్కువ నిల్వ చేస్తే చర్యలు తీసుకోవచ్చు.పెట్రోల్ నిల్వ కోసం గాలి తగలని పాత్రలో ఉంచితే కొద్దిరోజులకు అవిరైపోతుంది. గాలి చొరబడని డబ్బాలో నీడలో నిల్వ చేస్తే సుమారు ఒక సంవత్సరం నిల్వ ఉంటుంది. డబ్బా మూత తెరిస్తే నిల్వ కాలం తగ్గుతుంది. 20 డిగ్రీల సెల్సియస్ వద్ద సుమారు ఆరు నెలల వరకు, 30 డిగ్రీల వద్ద మూడు నెలల వరకు నిల్వ చేయవచ్చు.డీజిల్ తక్కువ పాడవుతుందీ కానీ ఎక్కువకాలం నిల్వ చేస్తే జిగురు ఏర్పడి ఇంజిన్ ఫిల్టర్లు మూతబడేలా చేస్తుంది. గాలి చొరబడని డబ్బాలో నీడలో నిల్వ చేస్తే సుమారు ఒక సంవత్సరం నిల్వ ఉంటుంది. దీర్ఘకాల నిల్వ కోసం ప్రతీ ఆరు నెలలకు ఒకసారి బయోసైడ్ చికిత్స అవసరం. సారాంశంగా, పెట్రోల్, డీజిల్ ఎక్కువ కాలం నిల్వ చేయవచ్చు, కానీ సరైన డబ్బాలు, నీడ, మూతలతో నిల్వ చేయడం, నిర్దిష్ట కాలం పైగా నిల్వ చేయడం మానుకోవడం అవసరం.

## రైల్వే టికెట్లు సెకన్లలో బుక్ హైస్పీడ్ రిజర్వేషన్ సిస్టమ్ త్వరలో ప్రారంభం




**హైదరాబాద్,** ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టే కొత్త రైల్వే రిజర్వేషన్ సిస్టమ్ త్వరలోనే అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం 1985 నుండి ఉపయోగంలో ఉన్న ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన టికెటింగ్ వ్యవస్థలలో ఒకటిగా నిలిచింది. నాలుగు దశాబ్దాలుగా ఈ సిస్టమ్ కొనసాగుతూ, కొన్ని సవరించింపులు పొందినప్పటికీ, సర్వర్ నెమ్మదిగా పనిచేయడం, టికెట్లు సులభంగా బుక్ కాకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి.ఐఆర్‌సీటీసీ కొత్త హైస్పీడ్ రిజర్వేషన్ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేయడంలో రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేయనుంది. ఈ కొత్త సిస్టమ్ ద్వారా నిమిషానికి 1.25 లక్షల టికెట్లు బుక్ చేయవచ్చు. నెక్స్ట్ జనరేషన్ సిస్టమ్ వెబ్ సైట్ స్లో అవ్వడాన్ని తగ్గిస్తుంది, పీక్ బుకింగ్ సమయంలో సర్వర్ ఇష్యూస్ రాకుండా చూసుకుంటుంది. ఆటోమేటెడ్ బాట్స్ వల్ల టికెట్ల రిజర్వేషన్ కోల్పోకుండా సమర్ధవంతంగా టికెట్లు బుక్ చేయవచ్చు.నూతన వ్యవస్థ స్థిరత్వం, వేగం, సౌకర్యాన్ని పెంచడమే లక్ష్యం. సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఈ ప్రాజెక్టును చేపడుతోంది. కొత్త సిస్టమ్ అందుబాటులోకి రాగానే ప్రయాణికులు సులభంగా, వేగంగా, సమస్యలేమీ లేకుండా రైల్వే టికెట్లు బుక్ చేసుకోవచ్చు.

## ఆధార్ కార్డు వాడేవారికి కేంద్రం సూపర్ న్యూస్




**- 5 17 ఏళ్ల పిల్లలకు ఉచితంగా అప్డేట్...**

**హైదరాబాద్,** ఆధార్ కార్డు వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. 5 నుంచి 17 ఏళ్ల మధ్య వయసు ఉన్నవారికి ఆధార్ కార్డు బయోమెట్రిక్స్ వివరాలను ఉచితంగా అప్డేట్ చేసుకునే అవకాశం కల్పించింది. యూఐడీఏఐ ప్రకటన ప్రకారం, ఈ సదుపాయం సెప్టెంబర్ 30వ తేదీ వరకు అమల్లో ఉంటుంది. సాధారణంగా బయోమెట్రిక్ వివరాలను అప్డేట్ చేసుకోవడానికి కొన్ని సర్వీస్ ఛార్జీలు వసూలు చేయబడతాయి, కానీ 5 17 ఏళ్ల పిల్లల కోసం ఈ సేవ పూర్తిగా ఉచితం.ఈ వయసులోని పిల్లల కోసం ఆధార్ అప్డేట్ ఎందుకు అవసరం? చిన్నతనంలో తీసుకున్న ఆధార్ బయోమెట్రిక్స్ వయసు పెరుగుత మారుతాయి. ఎప్పుడు అప్డేట్ చేయకపోతే ఆధార్ ఆధారిత సేవలలో ఇబ్బందులు ఎదుర్కోవచ్చు. ధృవీకరణ అవసరాల కోసం బయోమెట్రిక్స్ పనిచేయకపోవచ్చు. అందుకే తల్లిదండ్రులు పిల్లల ఆధార్ వివరాలను సమీప ఆధార్ సెంటర్‌లోకి తీసుకెళ్లి ఉచితంగా అప్డేట్ చేయించాలి. సెప్టెంబర్ తర్వాత ఈ అప్డేట్ చేయించుకోవడానికి రుసుం చెల్లించాల్సి ఉంటుంది.యూఐడీఏఐ ఆధార్ సర్వీస్ సెంటర్లతో పాటు దేశవ్యాప్తంగా స్కూల్స్, కాలేజీలలో ఉచిత క్యాంపులు కూడా నిర్వహిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో విద్యార్థులు ఈ క్యాంపుల ద్వారా ఆధార్ వివరాలను అప్డేట్ చేసుకోవచ్చు. ఏపీ, తెలంగాణలో కూడా ప్రతీ నెలలో మొదటి వారంలో ఈ క్యాంపులు నిర్వహించబడుతున్నాయి. కేంద్రం గూగుల్‌తో ఒప్పందం చేసుకొని ఆధార్ సెంటర్లను గూగుల్ మ్యాప్స్‌లో రిజిస్టర్ చేస్తుంది. ఇందులో సెంటర్ లొకేషన్, అందుబాటులో ఉన్న సేవల వివరాలు ముందుగా తెలుసుకోవచ్చు.

## ఎగుమతుల నిలిచిపోవడం వల్ల గుడ్ల ధరలు భారీగా తగ్గాయి




**హైదరాబాద్** ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య యుద్ధ పరిస్థితుల కారణంగా తెలంగాణ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లే గుడ్ల ఎగుమతులు నిలిచిపోయాయి. దీని ఫలితంగా స్థానిక మార్కెట్‌లో గుడ్ల నిల్వలు పెరిగిపోయాయి, దాంతో ధరలు ఒక్కసారిగా పతనమయ్యాయి.గత నెలలో కోడిగుడ్డు ధర 8 రూపాయల వరకు ఉన్నప్పటికీ, ప్రస్తుతం రిటైల్ మార్కెట్‌లో ఒక్కో గుడ్డు 5 రూపాయలకే లభిస్తోంది. హోల్‌సేల్ వ్యాపారులు ఒక్కో గుడ్డును 4 రూపాయలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఇది సామాన్య ప్రజలకు కొంత ఆర్థిక ఊరటను అందిస్తోంది.ఎగుమతుల నిలిచిపోవడమే కాకుండా, వేసవి తాపం వంటి ఇతర కారణాలూ ధరల తగ్గుదలకు దోహదం చేస్తున్నారు. సాధారణంగా రోజుకు 75 లక్షల గుడ్లు గల్ఫ్ దేశాలకు ఎగుమతి అవుతుండగా, ఆ సరఫరా ఆగినందున స్థానిక మార్కెట్ ప్రభావితమైంది.

## హీరోయిన్ల ప్రాధాన్య చిత్రాలకు హీరోలు వెనకడుగు తాప్సీ పన్ను సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్,** బాలీవుడ్‌లో తనదైన శైలితో, బలమైన పాత్రలతో ప్రత్యేక గుర్తింపు సంపాదించిన నటి తాప్సీ పన్ను తాజాగా చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా సినీ పరిశ్రమలో ఉన్న పురుషాధిక్యత, హీరోల ఆలోచనా విధానంపై ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన తాప్సీ, కథానాయికలకు ఎక్కువ ప్రాధాన్యం ఉన్న సినిమాల్లో నటించేందుకు చాలా మంది హీరోలు ఆసక్తి చూపడం లేదని వెల్లడించారు. ముఖ్యంగా తాను ద్విపాత్రాభినయం చేస్తున్న ఒక సినిమా సందర్భంలో ఎదురైన అనుభవాన్ని ఆమె పంచుకున్నారు. ఆ చిత్రానికి ముందు ఒక ప్రముఖ స్టార్ హీరోను సంప్రదించారని, కానీ కథలో హీరోయిన్ పాత్రకు అధిక ప్రాధాన్యం ఉందని తెలుసుకున్న తర్వాత ఆయన ఆ ప్రాజెక్ట్‌ను తిరస్కరించాడని తాప్సీ తెలిపారు. తనతో ఇప్పటికే పని చేసిన హీరోనే అయినప్పటికీ, పాత్ర నిడివి మరియు ప్రాధాన్యం కారణంగా వెనక్కి తగ్గడం తనకు ఆశ్చర్యం కలిగించిందని చెప్పారు. ఇంకా, ఇండస్ట్రీలోకి కొత్తగా వస్తున్న యువ హీరోలు కూడా హీరోయిన్ ఓరియెంటెడ్ చిత్రాల్లో నటించేందుకు పెద్దగా ముందుకు రావడం లేదని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రేక్షకుల ప్రశంసలు హీరోయిన్‌కే ఎక్కువగా దక్కుతాయనే భావనతో, ఇలాంటి సినిమాల నుంచి దూరంగా ఉ ంటున్నారని పేర్కొన్నారు. గ్లామర్ పాత్రలకు మాత్రమే పరిమితం కాకుండా, కథా ప్రధాన చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన తాప్సీ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు పరిశ్రమలో సమానత్వంపై మళ్లీ చర్చను రగిలిస్తున్నాయి. మహిళా పాత్రలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయానికి కొందరు మద్దతు తెలుపుతుండగా, మరికొందరు భిన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి.

## 'ధురంధర్ 2' జోరు 'డీడీఎల్జే' షో టైమ్‌లో మార్పు




**ముంబై,** రణ్‌వీర్ సింగ్ హీరోగా, ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ధురంధర్ 2 విడుదలకు ముందే బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టిస్తోంది. ఈ సినిమాపై ఉన్న భారీ అంచనాలు అడ్వాన్స్ బుకింగ్స్ రూపంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ జోరు కారణంగా ముంబైలోని ప్రసిద్ధ మరాఠా మందిర్ థియేటర్లో దశాబ్దాలుగా ప్రదర్శితమవుతున్న డీడీఎల్‌జే షో టైమ్‌ను మార్చాల్సి వచ్చింది. మూడు దశాబ్దాలుగా ఉదయం 11:30కు ప్రదర్శితమవుతున్న ఈ సినిమా ఇప్పుడు ఉదయం 10 గంటలకు మార్చడం విశేషం. ఇది 'ధురంధర్ 2' క్రేజ్‌కు నిదర్శనంగా మారింది. దాదాపు 3 గంటల 55 నిమిషాల నిడివి ఉన్న ఈ చిత్రానికి థియేటర్లు ప్రత్యేక షెడ్యూల్స్ సిద్ధం చేస్తున్నాయి. మరాఠా మందిర్‌లో మధ్యాహ్నం 1:15, సాయంత్రం 5:30, రాత్రి 9:45 గంటలకు షోలు ప్లాన్ చేయగా, దేశవ్యాప్తంగా అర్ధరాత్రి, తెల్లవారుజామున ప్రత్యేక ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే రూ. 30 కోట్లకు పైగా అడ్వాన్స్ బుకింగ్స్ సాధించిన ఈ చిత్రం, జవాన్, పుష్ప 2 వంటి భారీ చిత్రాల రికార్డులను సవాల్ చేస్తోంది. విడుదలకు ముందే ఈ స్థాయి హైప్ రావడంతో, 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్ సాధించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మొత్తానికి, విడుదలకు ముందే రికార్డుల దిశగా దూసుకెళ్తున్న ఈ సినిమా, థియేటర్ల షెడ్యూల్స్‌ను మార్చేంత ప్రభావం చూపించడం ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

## ఐపీఎల్‌లో ఫ్రాంచైజీల అమ్మకం జోరు...




**హైదరాబాద్,** ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన క్రికెట్ లీగ్‌లలో ఒకటైన ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఫ్రాంచైజీల కొనుగోలు, అమ్మకాలపై భారీ ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మరియు రాజస్థాన్ రాయల్స్ జట్ల అమ్మకం ప్రక్రియలు చివరి దశకు చేరుకోవడంతో వ్యాపార వర్గాల్లో ఉత్కంఠ పెరిగింది. అత్యంత విలువైన ఫ్రాంచైజీలలో ఒకటైన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కోసం గట్టి పోటీ నెలకొంది. దాదాపు రెండు బిలియన్ అమెరికన్ డాలర్లు (సుమారు పదహారు వేల ఆరు వందల కోట్లు రూపాయలు) విలువతో ఈ ఒప్పందం పూర్తయ్యే అవకాశముందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. స్వీడన్‌కు చెందిన ప్రైవేట్ పెట్టుబడి సంస్థ ఈక్యూటీ ప్రధాన పోటీదారుగా నిలవగా, మరోవైపు మణిపాల్ ఆసుపత్రుల అధినేత రంజన్ పాయ్, అమెరికాకు చెందిన పెట్టుబడి సంస్థ కోల్‌బర్గ్ క్రావిస్ రాబర్ట్స్ అండ్ కంపెనీ, సింగపూర్‌కు చెందిన టెమాసెక్ హోల్డింగ్స్ కలిసి ఒక కన్సార్టియంగా బిడ్ దాఖలు చేసినట్లు సమాచారం. గతంలో గ్లేజర్ కుటుంబం మరియు ఆదార్ పూనావాలా కూడా ఆసక్తి చూపినప్పటికీ చివరికి రేసు నుంచి తప్పుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ జట్టును కలిగి ఉన్న డియాజియో సంస్థ ఈ నెల ముప్పై ఒకటో తేదీ నాటికి ఒప్పందం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇదిలా ఉంటే మరోవైపు రాజస్థాన్ రాయల్స్ జట్టు అమ్మకానికి కూడా రంగం సిద్ధమైంది. ఈ జట్టును కొనుగోలు చేసేందుకు పలువురు దిగ్గజ సంస్థలు బిడ్లు దాఖలు చేసినట్లు సమాచారం. ముఖ్యంగా ఆదిత్య బిర్లా గ్రూప్ ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది. అమెరికాకు చెందిన డేవిడ్ బ్లిట్జర్‌తో కలిసి ఈ గ్రూప్ ఒక కన్సార్టియంగా బిడ్ పెట్టినట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ జట్టుకు ఒక బిలియన్ పది కోట్ల నుంచి ఒక బిలియన్ ముప్పై ఐదు కోట్ల అమెరికన్ డాలర్ల మధ్య ఆఫర్లు వచ్చినట్లు సమాచారం. మొదట మెజారిటీ వాటాను మాత్రమే విక్రయించాలని భావించిన యాజమాన్యం, ఇప్పుడు పూర్తి అమ్మకానికి కూడా సిద్ధమైందని తెలుస్తోంది. ఈ ప్రక్రియను రైన్ గ్రూప్ పర్యవేక్షిస్తోంది. ఆసక్తికరంగా ఈ రెండు జట్ల అమ్మకాలకూ మార్చి ముప్పై ఒకటో తేదీనే తుది గడువుగా నిర్ణయించడంతో ఐపీఎల్ వర్గాల్లో ఉత్కంఠ మరింత పెరిగింది.

## ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో భారత హవా




**- టాప్-5లో కోహ్లీ, రోహిత్, గిల్!**

**దుబాయ్,** ఐసీసీ తాజాగా ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో భారత బ్యాటర్లు తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. ప్రపంచ అత్యుత్తమ టాప్-5 వన్డే బ్యాటర్ల జాబితాలో ముగ్గురు టీమ్ ఇండియా ఆటగాళ్లు చోటు సంపాదించుకోవడం విశేషం. ఈ ఫార్మాట్‌లో కివీస్ స్టార్ బ్యాటర్ డారిల్ మిచెల్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా, రన్ మెషిన్ విరాట్ కోహ్లీ రెండో ర్యాంకును కైవసం చేసుకున్నారు. టీమ్ ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ నాలుగో స్థానంలో, యువ సంచలనం శుభ్‌మన్ గిల్ ఐదో స్థానంలో నిలిచారు. బౌలింగ్ విభాగంలో భారత్ తరపున కుల్‌దీప్ యాదవ్ ఒక్కరే టాప్-10లో చోటు దక్కించుకుని ఎనిమిదో ర్యాంకులో కొనసాగుతున్నారు. మరోవైపు, టీ20 ర్యాంకింగ్స్‌లో కూడా భారత ఆటగాళ్లు సత్తా చాటుతున్నారు. టీ20 బ్యాటింగ్ విభాగంలో లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లు అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ మొదటి రెండు స్థానాల్లో జైత్రయాత్ర కొనసాగిస్తున్నారు. యువ ఆటగాడు తిలక్ వర్మ ఆరో స్థానానికి ఎగబాకగా, సంజు శాంసన్ 21వ ర్యాంకుకు చేరుకున్నారు. బౌలింగ్ విభాగంలో స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఒక స్థానాన్ని మెరుగుపరుచుకుని టాప్-5లోకి ప్రవేశించగా, వరుణ్ చక్రవర్తి రెండో స్థానంలో నిలిచారు. ఆల్‌రౌండర్ల జాబితాలో హార్దిక్ పాండ్యా రెండో స్థానంలో కొనసాగుతున్నారు. జట్ల పరంగా చూస్తే, భారత్ వన్డే మరియు టీ20 ఫార్మాట్లలో నంబర్ వన్ స్థానంలో ఉండగా, టెస్టుల్లో నాలుగో స్థానంలో నిలిచింది.

Edited, Published & Owned by **BHUPATHI SANTHOSH.** Printed at PARAHUSHAR PRINTING PUBLICATIONS, H. NO. 1-6-27/2,SRI NAGAR COLONY, MAHABUBABAD, WARANGAL, TELANGANA-506101.Published at Jammikunta, karimnagar,Telangana-505122. EDITOR: BHUPATHI SANTHOSH. Cell: 9247819181 | **RNI No: TGTEL/25/A1882,** Email:Mana vaartha tg. Daily@gmail.com